

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 30-01-2025 | సంపుటి - 21 | సంచిక -282 | రూ : 4 | పేజీలు: 8




## ట్యాంక్‌బండ్ చుట్టూ
# పర్యాటక వలయం

- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఫిబ్రవరి 10లోగా పర్యాటక విధానాన్ని సిద్ధం చేయాలని స్పష్టీకరణ

హైదరాబాద్: రాష్ట్రాభివృద్ధికి సమగ్ర పర్యాటక విధానాన్ని ఫిబ్రవరి 10లోగా సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రదేశాలు, అభయారణ్యాలు, ఆలయాల ప్రాతిపదికన విధానాన్ని రూపొందించాలని.. రాష్ట్రానికి మరింత గుర్తింపు, ఆదాయం వచ్చేలా దీన్ని రూపొందించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజానికి అవసరమైన ప్రాంతాలను గుర్తించి, అభివృద్ధిచేసేలా ప్రణాళికలు ఉండాలని, సింగపూర్ తరహా విధానాలను పరిశీలించాలని ఆదేశించారు. బుధవారమిక్కడ సీఎం తన నివాసంలో పర్యాటక శాఖపై సమీక్ష నిర్వహించారు. "సింగపూర్ వంటి దేశాలు తక్కువ ప్రదేశంలో వైవిధ్యమైన ప్రణాళికలతో పెద్దసంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాయి. ఇదే తరహాలో రాష్ట్రంలోనూ ఈ రంగం నుంచి వచ్చే ఆదాయం పెరిగితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ మరో దశకు చేరుకుంటుంది. ఈ రంగంలో బహుళజాతి సంస్థల పెట్టుబడులతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు ఏర్పడతాయి. తద్వారా ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించవచ్చు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లోని సంజీవయ్య, ఎన్టీఆర్, ఇందిరాపార్కులను కలుపుతూ ట్యాంక్‌బండ్ చుట్టూ స్కైవాక్, పర్యాటక

తరువాయి 2లో

## సమగ్ర కుటుంబ సర్వే
# విజయవంతం...

- సామాజిక సాధికారత, అభ్యున్నతికి దోహదం
- రెండు రోజుల్లో ముసాయిదా నివేదిక
- ఫిబ్రవరి 2న మంత్రివర్గ ఉపసంఘానికి...
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహించిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే విజయవంతమైందని, అది దేశానికే ఆదర్శంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సర్వే సామాజిక సాధికారతను సాధించడానికి, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందన్నారు. సర్వే డేటా ఎంట్రీ పూర్తయిందని, రెండు రోజుల్లో ముసాయిదా నివేదికను సిద్ధం చేసి, ఫిబ్రవరి 2న మంత్రివర్గ ఉపసంఘానికి అందించాలని ఆయన ఆదేశించారు. సర్వేపై బుధవారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల

తరువాయి 2లో



## ఏపీలో వాట్సప్‌తో
# పౌరసేవలకు నేడు శ్రీకారం

- తొలి దశలో 161 సేవలు అందుబాటులోకి
- అధికారికంగా ప్రారంభించనున్న మంత్రి లోకేశ్
- దేశంలోనే తొలిసారిగా వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం
- సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు




అమరావతి: దేశంలోనే తొలిసారిగా.. రాష్ట్ర ప్రభుత్వం పౌరసేవలు అందించేందుకు, ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా వాట్సప్ పరిపాలన (వాట్సప్ గవర్నెన్స్)కు నేడు శ్రీకారం చుట్టనుంది. తొలి దశలో మొత్తం 161 రకాల పౌర సేవలు అందించనుంది. రెండో విడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. మంత్రి నారా లోకేశ్ గురువారం దీన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. తొలి విడతలో దేవాదాయ,

తరువాయి 2లో

## 'ఇందిరమ్మ ఇళ్ల'లో ఏఐని ఉపయోగించుకోండి

**అక్రమాలకు అవకాశం ఇవ్వొద్దు: పొంగులేటి**

హైదరాబాద్: ఇందిరమ్మ పథకంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు ఎలాంటి అక్రమాలు జరగకుండా కృతిమ మేధ(ఏఐ)ను ఉపయోగించుకోవాలని అధికారులను రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. సచివాలయంలోని తన

తరువాయి 2లో



## ఎమ్మెల్సీ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల..

- ఉభయ గోదావరి, గుంటూరు-కృష్ణా పట్టభద్రుల, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గాలకు..
- ఫిబ్రవరి 3 నుంచి నామినేషన్ల స్వీకరణ.. 27న పోలింగ్

2లో





## ఏడు నెలలుగా అంతరిక్షంలో..
# శూన్యంతో సునీతా పోరాటం!

వాషింగ్టన్: మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాల వల్ల గత ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. ఆమె తిరిగి భూమ్మీద ఎప్పుడు అడుగుపెడతారో స్పష్టత లేదు. అంతరిక్షం నుంచి ఇటీవల విద్యార్థులతో మాట్లాడుతూ సునీత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఏడు నెలలుగా నేను నడవలేదు.. కూర్చోలేదు. పడుకొని విశ్రాంతి తీసుకోడానికీ వీలులేకుండా పోయింది. జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండటంతో నేలపై నడిచిన అనుభూతిని గుర్తు తెచ్చుకోలేకపోతున్నా. మా మిషన్ ప్రకారం నెల రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగి రావాలి. కానీ, ఇంతకాలం ఇక్కడ ఉండటం కొంచెం షాకింగ్‌గా అనిపిస్తోంది'' అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి అదే నెల 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా

తరువాయి 2లో

# ఇస్రో సెంచరీ

* 100వ ప్రయోగం విజయవంతం
* ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్15

శ్రీహరికోట : వినువీధిలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సత్తా చాటింది. క్రికెట్‌లో శతకం కొట్టిన బ్యాటర్ విజయగర్వంతో బ్యాట్‌ను చూపించిన తరహాలోనే జీఎస్ఎల్‌వీ రాకెట్ నింగిలోకి దూసుకెళుతుండగా ఇస్రో సగర్వంగా, దిగ్విజయంగా 100వ ప్రయోగ మైలురాయిని అందుకుంది. 27:30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం బుధవారం ఉదయం 6:23 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోట సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీఎఫ్15 వాహకనౌక నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్లింది. 19 నిమిషాల తర్వాత ఎన్‌వీఎస్02 ఉపగ్రహాన్ని జియోసింక్రనస్

తరువాయి 2లో



# కుంభమేళాలో విషాదం



- తొక్కిసలాటలో 30 మంది దుర్మరణం..
- 60 మందికి గాయాలు
- మృతుల్లో నలుగురు కర్ణాటక వాసులు
- అఖాడాల సంగం ఘాట్‌కు పోటెత్తిన భక్తులు
- బారికేడ్లపైకి ఎక్కడంతో దుర్ఘటన
- రాష్ట్రపతి, ప్రధాని తీవ్ర దిగ్భ్రాంతి
- 4 సార్లు యోగికి మోదీ ఫోన్
- న్యాయ విచారణకు సీఎం ఆదేశం
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం

2లో

# సమగ్ర కుటుంబ సర్వే విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సర్వేను విజయవంతంగా నిర్వహించారంటూ అధికారులు, ఉద్యోగులను సీఎం అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ''ప్రజలకిచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించి చిత్తశుద్ధిని చాటుకుంది. అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే 2024 ఫిబ్రవరి 4న సర్వేపై నిర్ణయం తీసుకుని, 16న శాసనసభలో తీర్మానం చేశాం. సెప్టెంబరు 12న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఉపసంఘాన్ని నియమించాం. అక్టోబరు 9న మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులపై చర్చించి, ప్రణాళిక విభాగాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించాం. అక్టోబరు 10న సర్వే విధివిధానాలతో జీవో నంబరు 18 జారీ చేశాం. నవంబరు 6న సర్వే మొదలైంది. అన్ని జిల్లాల్లో డిసెంబరు మొదటివారంలో పూర్తయింది. ఈ మహాయజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కలిసి దాదాపు లక్ష మందికిపైగా పాలుపంచుకున్నారు. ఇంటింటికీ వెళ్లి దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను గుర్తించారు. మన సమగ్ర సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఉపయోగపడతాయి'' అని వివరించారు. అధికారులు మాట్లాడుతూ... ''దాదాపు 96 శాతానికిపైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు సేకరించాయి. కొన్ని కుటుంబాలు సర్వేకు నిరాకరించాయి. కొన్నిచోట్ల ఇళ్లకు తాళాలు ఉండటం, మరికొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవడంతో సర్వేలో పాలుపంచుకోలేదు''అని వెల్లడించారు.

**డెడికేటెడ్ కమిషన్ నివేదికపైనా చర్చ**

ఈ సందర్భంగా డెడికేటెడ్ కమిషన్ నివేదికపైనా సీఎం చర్చించినట్లు తెలిసింది. సమగ్ర కుటుంబ సర్వే నివేదిక అనంతరం పది రోజుల్లో డెడికేటెడ్ కమిషన్ నివేదిక వచ్చేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం.

* **ఫిబ్రవరి మొదటి వారంలోనే క్యాబినెట్ భేటీ**

సీఎం రేవంత్‌రెడ్డి... పంచాయతీ ఎన్నికలపైనా ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులతో చర్చించినట్లు తెలిసింది. తాము సన్నద్ధంగా ఉన్నామంటూ పంచాయతీరాజ్, ఎన్నికల సంఘం అధికారులు తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుటుంబ సర్వే, బీసీ డెడికేటెడ్ కమిషన్‌ల నివేదికలు సిద్ధమయ్యాక ఫిబ్రవరి మొదటి వారంలో మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో నివేదికల ఆమోదం అనంతరం... వాటిపై చర్చించేందుకు శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. అందులో బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి... కేంద్ర ప్రభుత్వానికి పంపించే వీలుంది. కేంద్రం స్పందన ఎలా ఉన్నా... రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు వెళ్లాలనే కార్యాచరణతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

# ఏపీలో వాట్సప్‌తో పౌరసేవలకు నేడు శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

ఇంధన, ఏపీఎస్ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలవుతాయి. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సమీక్షించారు. వాట్సప్ ద్వారా ఎలా సేవలు పొందవచ్చో అధికారులు ప్రజంటేషన్ ద్వారా ఆయనకు వివరించారు. సీఎం మాట్లాడుతూ వాట్సప్ సేవలతో ధ్రువపత్రాల కోసం పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకనున్నట్లు వెల్లడించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

* సైబర్ భద్రతను బలోపేతం చేయాలి: చంద్రబాబు
* పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
* ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేయాలి.
* వాట్సప్ ద్వారా సేవలందించేందుకు గతేడాది అక్టోబరు 22న మెటాతో ఒప్పందం చేసుకుంది.
* రాష్ట్రాన్ని డిజిటల్ టెక్నాలజీ వినియోగంలో అగ్రగామిగా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పాలన, ప్రభుత్వ సేవలను పౌరులకు వేగవంతంగా అందజేయడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది.

**అధికారిక వాట్సప్ నంబర్‌తో..**

* వాట్సప్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రభుత్వ అధికారిక వాట్సప్ నంబర్‌ను ప్రకటిస్తారు. ఆ ఎకౌంట్‌కు వెరిఫైడ్ ట్యాగ్ (టిక్ మార్క్) ఉంటుంది.
* ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని పౌరులకు చేరవేయాలంటే ఈ వాట్సప్ ఖాతా ద్వారా సందేశాలు పంపిస్తుంది. ఒకేసారి కోట్ల మందికి ఈ సమాచారం చేరుతుంది. వరదలు, వర్షాలు, విద్యుత్తు సబ్‌స్టేషన్ల మరమ్మతులు, వైద్యారోగ్య, వ్యవసాయ, అత్యవసర, పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధి సమాచారం వంటివి అందిస్తారు. ప్రజలు వినతులు, ఫిర్యాదులు ఇవ్వాలనుకుంటే.. ఈ వాట్సప్ నంబర్‌కు మెసేజ్ చేస్తే వెంటనే ఒక లింక్ వస్తుంది. అందులో పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితరాలు పొందుపరిచి, వారి వినతిని టైప్ చేయాలి. వెంటనే వారికి ఒక రిఫరెన్స్ నంబరు వస్తుంది. దాని ఆధారంగా తమ వినతి పరిష్కారం ఎంత వరకూ వచ్చింది? ఎవరి వద్ద ఉంది అనేది పౌరులు తెలుసుకోవచ్చు. ఎలాంటి సమస్యనైనా ఇక్కడ విన్నవించొచ్చు.
* ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్హతలు, ఆయా పథకాల ద్వారా కలిగే లబ్ధి తదితర అంశాలన్నింటి గురించి ఈ వాట్సప్ నంబరుకు మెసేజ్ చేసి, తెలుసుకోవచ్చు.
* రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సప్‌లో పంపిస్తారు. మీకు కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని.. టికెట్లు, వసతి సహా అన్నీ బుక్ చేసుకోవచ్చు. దేవాలయాల్లో దర్శనాల స్లాట్లు, వసతి బుక్ చేసుకోవడం, విరాళాలు పంపటం వంటివి చేయొచ్చు.

**ధ్రువపత్రాలూ పొందవచ్చు..**

* ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నో ఎర్నింగ్.. ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు వాట్సప్ ద్వారా పొందవచ్చు.
* ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసుకోవచ్చు.
* విద్యుత్తు బిల్లులు, ఆస్తి పన్నుల వంటివి ఈ అధికారిక వాట్సప్ ద్వారా చెల్లించవచ్చు. ట్రేడ్ లైసెన్సులు వంటివి పొందవచ్చు.
* రెవెన్యూ శాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు పొందవచ్చు.
* ఏపీఎస్ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ రిమైండర్, ట్రాకింగ్ సర్వీసు, సర్వీసు, రిఫండ్, ఫీడ్‌బ్యాక్ తదితర సేవలు పొందవచ్చు.

# ఇస్రో సెంచరీ

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లో ప్రవేశపెట్టింది. 2,250 కేజీల ఎన్‌వీఎస్02.. స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ (నావిక్)లో రెండో జనరేషన్ ఉపగ్రహం. ఇందులో ఉండే 'రుబిడియం అటామిక్ ఫ్రీక్వెన్సీ స్టాండర్డ్' అణు గడియారం ఉపగ్రహానికి కీలకమైంది. భారత్‌తో పాటు చుట్టుపక్కల 1,500 కి.మీ. ఈ ఉపగ్రహం పరిధిలోకి వస్తుంది. ఉపరితల, వాయు, సముద్ర నావిగేషన్, వ్యవసాయం, శాటిలైట్‌ల గమన మార్గం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) తదితరాలకు ఎన్‌వీఎస్02 సేవలు ఉపయోగపడతాయని ఇస్రో పేర్కొంది.

* **ఐదేళ్లలో 200 మార్కును అందుకుంటాం!**

ఇస్రో అధిపతి వి.నారాయణన్ వచ్చే ఐదేళ్లలో రెండు వందల ప్రయోగాల మార్కును అందుకుంటామని, అది సాధ్యమేనని ఇస్రో అధిపతి వి.నారాయణన్ ధీమా వ్యక్తం చేశారు. సంస్థ వందో మిషన్ జీఎస్ఎల్‌వీఎఫ్15 ప్రయోగం విజయవంతమైన తర్వాత ఆయన శ్రీహరికోటలో మీడియాతో మాట్లాడారు. శాస్త్రవేత్తల కృషికి ప్రతిఫలం దక్కిందని, ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇప్పటి వరకు ఇస్రో ఆరు తరాల రాకెట్‌లను అభివృద్ధి చేసిందని, 1979లో ఏపీజే అబ్దుల్‌కలాం ప్రాజెక్టు డైరెక్టర్‌గా, సతీశ్ ధవన్ మార్గదర్శకత్వంలో మొదటి రాకెట్ రూపుదిద్దుకుందని గుర్తుచేసుకున్నారు. '1976లో ఎస్ఎల్‌వీ3తో మొదలైన ఇస్రో ప్రయాణం 46 ఏళ్లకు 100 రాకెట్ ప్రయోగాల మైలురాయిని అందుకుంది. ఈ కాలంలో 433 విదేశీ ఉపగ్రహాలు సహా 548 శాటిలైట్‌లను కక్ష్యలోకి చేర్చాం' అని పేర్కొన్నారు. 100 రాకెట్ ప్రయోగాలు చేపట్టడానికి 46 ఏళ్లు పట్టిందని, 200 మార్క్‌ను ఐదేళ్లలో చేరుకోగలమా అనే ప్రశ్నకు నారాయణన్ సమాధానం ఇస్తూ ఆ లక్ష్యం కోసం ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో ముందుకు వెళతామన్నారు.

* **ఈ ఏడాదంతా బిజీ షెడ్యూల్..**

ఈ ఏడాది కీలకమైన మిషన్లు చేపట్టాల్సి ఉందని నారాయణన్ వెల్లడించారు. మార్చిలో నాసా ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్ (నిసార్) ప్రయోగం ఉంటుందని, ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎర్త్ ఇమేజింగ్ ఉపగ్రహమని తెలిపారు. దీనిని రూ.12,500 కోట్లతో రూపొందించినట్లు చెప్పారు. తర్వాతి నావిగేషన్ శాటిలైట్‌ను ఆరు నెలల్లో ప్రయోగిస్తామని, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) కోసం ఓ వాణిజ్య ప్రయోగంతో పాటు టీడీఎస్01 మిషన్ చేపడతామని వివరించారు. భవిష్యత్తు ప్రయోగాలకు కీలకమైన నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికల్ (ఎన్‌జీఎల్‌వీ) తయారీకి కేంద్రప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని నారాయణన్ తెలిపారు. గగన్‌యాన్ మిషన్ సాధనకు వేగంగా ముందుకెళుతున్నామని, ఈ ఏడాది అన్ క్రూ మిషన్ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నారాయణన్ వెల్లడించారు.

* **అద్భుతమైన మైలురాయి: ప్రధాని మోదీ**

దిల్లీ: ఇస్రో చేపట్టిన 100వ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. అద్భుతమైన మైలురాయిని అందుకున్నారని శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఈ విజయం దేశ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల శ్రమ, చిత్తశుద్ధికి ఫలితం. ప్రైవేటు రంగం సహకారంతో భారత అంతరిక్ష రంగం సరికొత్త ఎత్తుల వైపు వేగంగా పయనిస్తుంది' అని పేర్కొన్నారు.

## ఏడు నెలలుగా అంతరిక్షంలో.. శూన్యంతో సునీతా పోరాటం!

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో ఇద్దరూ ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు.

**ట్రంప్ కోరారు.. మేం తీసుకొస్తాం : -మస్క్**

అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను సురక్షితంగా భూమ్మీదకు తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సాయం కోరినట్లు 'స్పేస్ ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ వెల్లడించారు. త్వరలో ఈ పని పూర్తిచేస్తామని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. వారిద్దరినీ తిరిగి భూమి పైకి తీసుకువచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని.. వారు చేసిన ఆలస్యం వల్ల వ్యోమగాములు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విమర్శించారు.



## ఉద్యోగం వదులుకుంటే 8 నెలల జీతం

*** ప్రభుత్వోద్యోగులకు ట్రంప్ ప్రభుత్వ ఆఫర్**

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వోద్యోగుల సంఖ్యను కుదించే దిశగా ట్రంప్ ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఫిబ్రవరి 6 లోగా స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదులుకోవడానికి సిద్ధమయ్యే వారికి 8 నెలల జీతం ఇస్తామని ప్రతిపాదించింది. ఈ మేరకు 20 లక్షల మంది ప్రభుత్వోద్యోగులకు ఈమెయిల్ పంపినట్టు అమెరికా ప్రభుత్వ సామర్థ్య పెంపుదల శాఖ(డోజ్) సలహాబోర్డు సభ్యురాలు కేటీ మిల్లర్ మంగళవారం తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అమెరికా ఫెడరల్ (సమాఖ్య) ప్రభుత్వంలో ప్రస్తుతం సుమారు 30 లక్షల మంది ఉద్యోగులున్నారు. దేశంలోని మొత్తం ఉద్యోగవర్గ సంఖ్యలో ఇది 1.9 శాతం అని ప్యూ రిసెర్చ్ సెంటర్ తెలిపింది. ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ కొద్ది శాతం మంది ఉద్యోగులు కొలువును వదులుకున్నా అది పెను సంచలనమే కానుంది. దీనివల్ల హఠాత్తుగా ఏర్పడే సిబ్బంది కొరతతో ఫెడరల్ ప్రభుత్వ సేవలపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వానికి చెందిన సిబ్బంది నిర్వహణ కార్యాలయం ఉద్యోగులను ఉద్దేశిస్తూ ఓ మెమో విడుదల చేసింది. ప్రభుత్వోద్యోగులంతా మెరుగైన పనితీరు, ఉత్తమ ప్రవర్తన కనబర్చేలా చూస్తామని అందులో పేర్కొంది. తద్వారా భవిష్యత్తులో ఉద్యోగుల కుదింపు గురించి పరోక్ష హెచ్చరిక చేసింది. మరోవైపు కొవిడ్ కాలం నుంచీ ఆఫీసుకు రాకుండా ఆన్‌లైన్ పద్ధతిలో పనిచేస్తున్న ఫెడరల్ ఉద్యోగులకు ట్రంప్ ప్రభుత్వం మరో తాఖీదు ఇచ్చింది. ''పనిచేసేందుకు మీరు మీ ఆఫీసుకు హాజరుకావాలి. అలా చేయకుంటే మీ ఉద్యోగం ఉండదు'' అని ఉద్యోగులకు పంపిన ఒక ఈమెయిల్ తెలియజేసింది.

## ట్యాంక్‌బండ్ చుట్టూ పర్యాటక వలయం

(మొదటిపేజీ తరువాయి)

వలయాన్ని ఏర్పాటు చేయాలి. కవ్వాల్, అమ్రాబాద్ పులుల అభయారణ్యాలను సఫారీ టూరిజానికి అనుగుణంగా తీర్చిదిద్దాలి. మేడారం, రామప్ప దేవాలయం, లక్నవరాలను పర్యాటక వలయంగా ఏర్పాటు చేయాలి. నాగార్జునసాగర్, శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో కేరళ తరహా హౌస్‌బోట్ ద్వారా పర్యాటకుల సంఖ్య పెరిగేలా చూడాలి. బౌద్ధపర్యాటక కేంద్రాల్ని కలుపుతూ సర్క్యూట్‌తోపాటు సమ్మక్క, సారలమ్మ జాతరకు పెద్దసంఖ్యలో వచ్చే భక్తులు సమీపంలో పర్యాటక ప్రదేశాలను సందర్శించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. గోదావరి, కృష్ణా పుష్కరాలకు దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలి. ఆదిలాబాద్, వరంగల్, నాగార్జునసాగర్ లాంటి ప్రాంతాల్లో ఎకో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళికలు చేర్చాలి. అనంతగిరితోపాటు ఇతర ప్రాంతాల్లోనూ వసతులు మెరుగుపరచాలి'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సభర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఇందిరమ్మ ఇళ్ల'లో ఏఐని ఉపయోగించుకోండి

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో బుధవారం గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ''ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఇందులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకోవాలి. ముఖ్యంగా టెక్నాలజీని వాడితే రాజకీయ ప్రమేయానికి, ఇతర ప్రభావాలకు ఆస్కారం ఉండదు. ఇప్పటికే ఇందిరమ్మ యాప్ ద్వారా సర్వేను నిర్వహించాం. అందులోని వివరాలను క్లౌడ్ ఆధారిత ఏఐ టెక్నాలజీతో సరిపోలుస్తూ అర్హులను గుర్తించాలి. తొలి విడతగా స్థలాలున్న 72 వేల మందికి మంజూరు పత్రాలను అందజేశాం. ఈ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. ఇళ్ల లబ్ధిదారులకు నాలుగు దశల్లో చెల్లింపులు చేస్తాం. ఇందులో జాప్యం జరగకుండా, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రోజువారీగా ఇళ్ల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేలా కృతిమ మేధను ఉపయోగించుకోవాలి'' అని అధికారులకు మంత్రి సూచించారు. సమీక్షలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## మహా కుంభమేళాలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

మహాకుంభ్ నగర్: ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మౌనీ అమావాస్య సందర్భంగా అమృత స్నానం కోసం భారీగా భక్తులు తరలిరావడంతో సంగం ఘాట్‌వద్ద బుధవారం తెల్లవారుజామున తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 30 మంది మరణించారు. 60 మంది గాయపడ్డారు. ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని, ఇతర ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరోవైపు తొక్కిసలాటపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారాన్ని ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ప్రకటించారు. బుధవారం తెల్లవారుజామున 1, 2 గంటల మధ్య అఖాడాల కోసం ఏర్పాటు చేసిన సంగం స్నాన ఘాట్‌కు వెళ్లేందుకు అఖాడా మార్గ్‌వద్ద ఉన్న బారికేడ్లపైకి భక్తులు ఎక్కడంతో ఈ ఘటన జరిగిందని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. 'అఖాడాలు అమృత స్నానం చేసేందుకు సంగం ఘాట్‌వద్ద ఏర్పాట్లు చేశాం. అయితే పలువురు భక్తులు ఇక్కడికి వచ్చి బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో తొక్కిసలాట జరిగింది. పలువురు తీవ్రంగా గాయపడటంతో వెంటనే ఆసుపత్రికి తరలించాం' అని లఖ్‌నవూలో ఉన్నత స్థాయి సమావేశం తర్వాత యోగి వెల్లడించారు. భక్తుల భద్రతే తమ తొలి ప్రాధాన్యమని, ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్‌లో పరిస్థితి అదుపులో ఉందని, కానీ భక్తుల రద్దీ భారీగా ఉందని తెలిపారు. 'ప్రధాని మోదీ నాకు నాలుగుసార్లు ఫోన్ చేసి తొక్కిసలాట ఘటనపై ఆరా తీశారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గవర్నర్ ఆనందీబెన్ పటేల్ ఎప్పటికప్పుడు ఈ ఘటనపై సమీక్షిస్తున్నారు' అని యోగి తెలిపారు. తొక్కిసలాటలో ఎంతమంది మరణించిందీ తొలుత అధికారికంగా ప్రభుత్వం ప్రకటించలేదు. బుధవారం సాయంత్రానికి అధికారులు మృతుల వివరాలను వెల్లడించారు. 30 మంది మరణించారని, 60 మంది గాయపడ్డారని డీఐజీ వైభవ్ కృష్ణ మీడియా సమావేశంలో తెలిపారు. మృతుల్లో 25 మందిని గుర్తించామని, ఐదుగురిని గుర్తించాల్సి ఉందని వివరించారు. మృతుల్లో కర్ణాటకకు చెందిన నలుగురు ఉన్నారని, అస్సాం, గుజరాత్‌ల నుంచి ఒక్కొక్కరు ఉన్నారని తెలిపారు. గాయపడిన వారిలో 36 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, మిగిలిన వారికి ప్రాథమిక చికిత్స అందించి కుటుంబ సభ్యులకు అప్పగించామని తెలిపారు.

**రెండు గంటల సమయంలో...**

సంగం స్నాన ఘాట్‌కు వెళ్లే అఖాడాలను క్యూలలో పంపేందుకు అఖాడా మార్గ్‌లో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాధారణ భక్తులూ అక్కడికి రావడంతో ఒత్తిడి పెరిగింది. బ్రహ్మ ముహూర్తం కోసం వేచి ఉన్న భక్తులు తెల్లవారుజామున 1 గంట తర్వాత ఒక్కసారిగా బారికేడ్లపైకి ఎక్కడంతో అవి పడి పోయాయి. దీంతో తొక్కిసలాట జరిగింది. 2 గంటల సమయంలో సంగం ఘాట్‌వద్దకు అంబులెన్సులు, పోలీసు వాహనాలు వచ్చాయి. ఆ తర్వాత గాయపడిన పలువురిని భద్రత, సహాయక సిబ్బంది స్ట్రెచర్లపై తరలించడం కనిపించింది. తొక్కిసలాట తర్వాత కనిపించిన దృశ్యాలు.. ఘటన తీవ్రతకు అద్దం పట్టాయి. అక్కడ బ్యాగుల కుప్పలు.. చెల్లాచెదురుగా పడిన భక్తుల దుస్తులు దర్శనమిచ్చాయి. పరిస్థితి చేయి దాటిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంట తెచ్చుకున్న బ్యాగులు, లగేజీలతో పరుగెత్తలేక కొంత మంది కింద పడిపోయారు. కొంత మంది భక్తులు బారికేడ్లపై నుంచి దూకేందుకు ప్రయత్నించిన సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు గాయపడ్డారని, వారందరినీ ఆసుపత్రికి తరలించామని మేళా ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆకాంక్ష రాణా తెలిపారు. తొక్కిసలాట ఘటనపై ఏర్పాటు చేసిన న్యాయ విచారణ కమిషన్‌కు పదవీ విరమణ చేసిన జడ్జి హర్ష కుమార్ నేతృత్వం వహిస్తారు. సభ్యులుగా మాజీ డీజీపీ వీకే గుప్తా, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి డీకే సింగ్ నియమితులయ్యారు. విడిగా పోలీసు దర్యాప్తు కొనసాగుతుందని సీఎం తెలిపారు.

**'తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది'**

'మేం 60 మంది కలిసి రెండు బస్సుల్లో కర్ణాటక నుంచి వచ్చాం. మా గ్రూపులో 9 మందిమి ఉన్నాం. ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. అందులో మేం చిక్కుకుపోయాం. మాలో చాలా మంది కిందపడ్డాం. పరిస్థితి అదుపు తప్పింది. అన్నివైపుల నుంచి తోపులాట చోటుచేసుకోవడంతో తప్పించుకునే మార్గం లేకుండా పోయింది' అని సరోజిని అనే భక్తురాలు తెలిపారు. తన తల్లి గాయపడ్డారని, ఆసుపత్రి పాలయ్యారని మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్‌పుర్‌కు చెందిన ఓ భక్తుడు వెల్లడించారు.

# మైత్రి ఫౌండేషన్ సేవలు అభినందనీయం

**: మాజీ ఐఏఎస్ జయప్రకాష్ నారాయణ**



జిన్నారం(గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి 29: మైత్రి ఫౌండేషన్ నిర్వహిస్తున్న విద్య, వైద్యం సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ ఐఏఎస్ అధికారి డా. జయప్రకాష్ నారాయణ ప్రశంసించారు. బుధవారం ట్రస్ట్ చైర్మన్ చెన్నం శెట్టి ఉదయ్ కుమార్ ఆయనను కలిసి ఫౌండేషన్ ద్వారా అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యా, ఆరోగ్య రంగాలు అత్యంత కీలకం అని, మైత్రి ఫౌండేషన్ వీటిపై తీసుకుంటున్న చొరవ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నవీన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి కాపాడడంలో తహసీల్దార్ విఫలం

*** కార్యాలయం ముందు జిన్నారం గ్రామస్తుల ధర్నా**



జిన్నారం, ప్రజాస్ఫూర్తి 29: జిన్నారం మండల కేంద్రంలోని ఒకటో సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో ఇతరులు కబ్జా చేస్తున్నా తహసీల్దార్కి స్పందించడం లేదని జిన్నారం గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.గ్రామానికి చెందిన అంతి రెడ్డి గారి రమాదేవి తన 58 పట్టా భూమిలో వున్న భూమిని ఇతరులు కబ్జా చేయగా ఆమె ప్రభుత్వ భూమిని చూపిస్తూ పట్టా భూమి అంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇదే విషయంపై గ్రామస్తులు గతంలో రీ సర్వే చేయాలని తహసీల్దార్ కి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మరో సారి విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. విషయాన్ని మండలం సర్వేయర్, తహసిల్దార్, సంగారెడ్డి ఆర్డిఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

# ఫారెస్ట్ సెంట్రల్ ఎకోపార్క్ మంజూరు చేసి నిధులు కేటాయించండి

**: ఎమ్మెల్యే జారె**




దమ్మపేట: ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ అరణ్యభవన్ తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ప్రధానకార్యాలయంలో పీసీసీఎఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ యమ్. దోబ్రీయల్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవలే అశ్వారావుపేటను మున్సిపాలిటీగా చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిన సందర్భంలో మండలానికి సెంట్రల్ ఫారెస్ట్ ఎకోపార్క్ మంజూరు చేసి నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వినతిపత్రం అందజేశారు.

# ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

*** తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్**




ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను బుధవారం బంజారా హిల్స్ లోని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ నివాసంలో ఆయన పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి ప్రైవేట్ పాఠశాల లు ఎదుర్కొంటున్నటువంటి పలు సమస్యలను స్పీకర్ గడ్డం ప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్ళారు. వెంటనే సానుకూలంగా స్పందించిన ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్, కోశాధికారి కే శ్రీకాంత్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎం బసవరాజ్, హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ జయరాం ప్రసాద్, హైదరాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ జి రాములు, అంబర్ పేట్ మండల అధ్యక్షులు జె రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కూకట్‌పల్లి జంట సర్కిళ్ల డిసి లపై జర్నలిస్టుల ఆగ్రహం...

*** జర్నలిస్టుల బూచితో వసూళ్ళకు పాల్పడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి...**

*** బదనాం చేస్తే ధర్న చేస్తాం హెచ్చరించిన కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్**



(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) : విలేకరులను బూచిగా చూపిస్తు ఇళ్ళ నిర్మాణదారులను టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌లను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగ జర్నలిస్టులు మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహారశైలితో సమాజంలో జర్నలిస్టుల విలువలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలేకరులకు డబ్బులు ఇవ్వాలంటూ నిర్మాణదారుల వద్ద నుంచి పెద్ద మొత్తంలో వసూళ్ళకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో రాతలు రాయించి వాటిని విలేకరులు రాస్తున్నారంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, అధికారులే వారి అవసరాల కోసం సోషల్ మీడియాలో ఉన్నవారిని విలేకరులుగా ప్రచారం చేస్తున్నారని డిసిల దృష్టికి తీసుకువచ్చారు. భవనాల వద్ద డబ్బులు ముడితే ఒక విధంగా ముట్టకపోతే మరోలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. విలేకరులకు డబ్బులు పంచుతున్నామని చెప్పుకుతిరుగుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని మూసాపేట డిసి గంగాధర్‌ను డిమాండ్ చేశారు. తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోకపోతే సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు. కూకట్‌పల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్‌లో ఉన్న అవినీతి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్ వంశీకృష్ణకు సూచించారు. ఈ సందర్భంగా డిసిలు వంశీకృష్ణ, గంగాధర్‌లు మాట్లాడుతూ ఆయా విషయాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, రాష్ట్ర నాయకులు ఆర్ కె దయాసాగర్, నిమ్మల శ్రీనివాస్, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎంఏ కరీం, జర్నలిస్టు సంఘం నాయకులు మాణిక్యరెడ్డి, గంగరాజు, సదా మహేశ్, శ్రీనివాస్‌యాదవ్, చంద్ర, భాస్కర్ చారి, పవన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి జాతర ను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

*** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి , రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర ను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ అన్నారు. బుధవారం సూరారం కట్ట మైసమ్మ దేవాలయం వద్ద అత్యంత వైభవోపేతంగా ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న "శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి , రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల జాతర" ను విజయవంతం చేసేందుకు చేపట్టవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆలయ కమిటీ సభ్యులు , వివిధ విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ మాట్లాడుతూ కట్ట మైసమ్మ అమ్మవారి జాతరకు ప్రతి యేట లక్షలాదిమంది భక్తులు తరలి వస్తారు. నీటి సదుపాయం, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంపు వంటి ఏర్పాట్లను అన్ని విభాగాల అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. జాతరలో పోకిరిల బెడద లేకుండా షీ టీమ్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బోనాల జాతర వాల్ పోస్టర్ ను, కరపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, జిహెచ్ఎంసి ఉప కమిషనర్ మల్లారెడ్డి, సీఐ భరత్ కుమార్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, వాటర్ వర్క్స జీఎం అశోక్, ఈఈ క్రిష్టప్ప, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మన్నె బాలేష్, సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు వీరారెడ్డి, ప్రసాద్, మల్లేష్, దారం సాయి, కృష్ణారెడ్డి, ఈ. సురేష్, ఇంద్రసేన, సాయి గౌడ్, మహేష్ కుమార్, శివరాజ్, వెంకటేష్, లక్ష్మారెడ్డి, గోపాల్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఫలించిన ఉప్పల్ ఎమ్మెల్యే కృషి

*** ఉప్పల్ డిగ్రీ కళాశాల కి స్థలం మంజూరు**

ప్రజాస్ఫూర్తి, కాప్రా : చాలా రోజుల నుండి స్వంత స్థలం లేక ప్రభుత్వ పాఠశాల లో డిగ్రీ కళాశాల నడుస్తుంది. కళాశాల కి స్థలం మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని అడగగా వెంటనే ఎమ్మెల్యే మంత్రి శ్రీధర్ బాబు వద్ద స్థలం కేటాయించాలని కోరడం జరిగింది.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి మేరకు మంత్రి శ్రీధర్ బాబు స్థలం మంజూరు చేయడం జరిగింది.కళాశాల యాజమన్యం మంత్రి శ్రీధర్ బాబు కి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. విజయ్ కుమార్, డా. రవి ప్రసాద్, డా. తిరుపతి, గీత, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, అన్య బాల కృష్ణ, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్ , జెట్ట కిషోర్, సుక్క కిరణ్, ఇంద్రయ్య, బింగి భరత్ ,కడిగ శేఖర్, రాజు ,ఐలేష్ మహేందర్, శ్రీనివాస్ చారి, లింగం పల్లి ప్రభాకర్, యుగెందేర్ రెడ్డి, రోశయ్య ,మనీష్, రాజు లింగాయత్ తదితరులు పాల్గొన్నారు+

# అన్ని దానాల కన్నా అన్నదానం గొప్ప కార్యం

*** కుషాయిగూడ పోలీస్ ఇన్స్పెక్టర్ జి అంజయ్య.**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : అన్ని దానాల కన్న ఆకలితో ఉన్నవారి కడుపు నింపే అన్నదానం గొప్పదని కుషాయిగూడ పోలీస్ ఇన్స్పెక్టర్ జి. అంజయ్య అన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని వాసవి మిత్ర మండలి పూనుకోవడం శుభ పరిణామం అని ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. బుధవారం వాసవి మిత్రమండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ లో అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి తో కలిసి కుషాయిగూడ ఇన్స్పెక్టర్ అంజయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కుషాయిగూడ కు చెందిన పేద వృద్ధురాలు మాలే వరమ్మ కొండూరి విజయ , అంబేద్కర్ నగర్ కు చెందిన పడకంటి రామచందర్ గుప్తా లకు ఈ నెల పించిని ముగ్గురికి రూ.1000 ల చొప్పున ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి, ఉపాధ్యక్షులు చెన్న చక్రపాణి గుప్త, నంగునూరి అశోక్ గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త , బల్లి శ్రీధర్ గుప్త , కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ గుప్త , ఉప్పల ఆంజనేయులు గుప్త, రాయికంటి వేణుగుప్త, ఏనిశెట్టి రమేష్ గుప్త , సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, రాయికంటి ముత్యాలు, బస్సా శ్రీనివాస్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, కొకలా కృష్ణమూర్తి గుప్త, పెద్ది నవీన్ గుప్తా, రాజూరి జగదీష్ గుప్త ,రాయల శ్రవణ్ గుప్తా, గెలివి ప్రసాద్ గుప్తా ,విబివి కృష్ణ గుప్తా, కూరపాటి పవన్ కుమార్ గుప్తా, తోటం శెట్టి రామలింగయ్య గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్తా , తదితరులు పాల్గొన్నారు.

## ట్రస్మ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా గోనె హనుమంత రెడ్డి నియామకం



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా శామీర్ పేట కు చెందిన గోనె హనుమంత రెడ్డి నియమితులయ్యారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ లో ఆయనకు నియామక పత్రం అందించి నియమించారు. ఈ సందర్భంగా హన్మంతా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రయివేట్ పాఠశాలల సమస్యలపై తాను పోరాడుతానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వం కి ఈ సందర్భంగా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ .నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కే అనిల్ కుమార్, కోశాధికారి కే శ్రీకాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి చింతల రామచందర్, కోఆర్డినేటర్ రామ్ రెడ్డి ,అసోసియేటెడ్ ప్రెసిడెంట్ కె రామేశ్వర్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సోమశేఖర్ గౌడ్. తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

- ఇద్దరికి సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అనారోగ్యంతో బాధ పడుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది సిఎంఆర్ఎఫ్కు దరఖాస్తు చేసుకున్న ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అనితకు 60వేల రూపాయల, దుర్గం చంద్రంకు 20వేల రూపాయల చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంత రాజు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నిరుపేదలకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుందని, అనారోగ్యంతో బాధ పడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేని వారికి సిఎంఆర్ఎఫ్ ద్వారా భరోసానిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా చెక్కులు మంజూరు చేయించిన కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డికి వారు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ బోంధుగుల దేవి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వంగ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎక్కల దేవి మహేష్, తాటిపల్లి పద్మారెడ్డి, తినటి రాంరెడ్డి, వట్టిమర్ల రాజేశం, చిత్తారి రవి తదితరులున్నారు.

## ఇద్దరిపై కేసు, రిమాండ్‌కు తరలింపు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిపై, ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు రిమాండ్ తరలించినట్లు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 28న ఎలాంటి అనుమతి లేకుండా ముస్తాబాద్ మండలం కొండాపూర్ శివారులోని మానేరు వాగు నుండి దొంగతనంగా చంద్రమౌళి అనే వ్యక్తి టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా, పత్రిక విలేఖరి గుండవేణి దేవరాజు అనే వ్యక్తి ఫోటోలు, వీడియోలు రికార్డ్ చేస్తుండగా, పాక చంద్రమౌళి, అతని స్నేహితులు దేవరాజును ఫోటోలు, వీడియోలు తీయవద్దని అడిగారని తెలిపారు. దేవరాజు అక్కడి నుండి పారిపోగా, పాక చంద్రమౌళి, అతని స్నేహితులు దేవరాజు ఇంటికి వెళ్లి దేవరాజు కుటుంబ సభ్యులను దేవరాజు తీసిన ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయాలని, లేకుంటే చంపుతామని బెదిరించగా, గుండవేని దేవరాజు ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని తెలిపారు. దీంతో చంద్రమౌళి, అతని స్నేహితుల మీద కేసు నమోదు చేసి చంద్రమౌళిని అరెస్ట్ చేసి, అతని టిప్పర్, లారీ, వేగనార్ కారుని సీజ్ చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా పాక చంద్రమౌళి తన ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇసుకను మానేరు వాగు నుండి తీసుక వస్తుండగా గుండవేని దేవరాజు తాను పత్రిక విలేఖరి అని ఫోటోలు, వీడియోలు తీస్తూ తనకు 10 వేల రూపాయలు ఇవ్వాలని, లేకుంటే ఆ ఫోటోలు, వీడియోలు జిల్లా ఎస్పీ, కలెక్టర్లకు పంపుతానని బెదిరించడం జరిగిందని, గతంలో కూడా ఇలానే బెదిరించగా చాలా సార్లు డబ్బులు ఇవ్వడం జరిగిందని పాక చంద్రమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విలేఖరి దేవరాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

# నేర రహిత సమాజమే తెలంగాణ రాష్ట్ర పోలీసుల ధ్యేయం

* **తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్**





ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : నేర రహిత సమాజమే తెలంగాణ రాష్ట్ర పోలీసుల ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ అన్నారు. బుధవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అన్ని జోన్ల డీసీపీలు, అదనపు డీసీపీలు , ఎసిపి స్థాయి అధికారులతో నేరేడ్ మెట్ లోని కమీషనర్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారుల నుండి సంబంధిత జోన్లు , అడ్మిన్, ట్రాఫిక్, క్రైమ్, ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఎస్ఓటి, రిజర్వు పోలీస్ వంటి విభాగాల వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను ప్రత్యక్షంగా సందర్శించి, వారి పనితీరు సమీక్షించాలని , తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో దేశంలోని టాప్ పది రాష్ట్రాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉండడం గర్వకారణం అని అన్నారు. ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఇక్కడున్న ఇరవై నాలుగు గంటల పెట్రోలింగ్ గస్తీ వంటి ఏర్పాట్ల ద్వారా నెలకొన్న ప్రశాంత వాతావరణం వల్లనే మన రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే పెట్టుబడులు కూడా అధికంగా వస్తున్నాయన్నారు. తలసరి ఆదాయంలో కూడా మన రాష్ట్రం ముందంజలో ఉందని పేర్కొన్నారు.

ఇకనుండి రోజువారీ పెట్రోలింగ్ ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేరపరిశోధనలో, సాంకేతిక ఆధారాలను , సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికల మీద నిఘా వేసి ఉంచాలని, వారు మళ్ళీ నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి ప్రజలతో మమేకమై పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఫుట్ పెట్రోలింగ్ ను మరింత ముమ్మరంగా చేయాలని సూచించారు. నూతన నేర న్యాయ చట్టాల గురించి అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని, చట్టపరిధిలోనే పని చేయాలని, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలని, గరిష్ట శిక్షా రేటు సాధించేలా కృషి చేయాలని సూచించారు. మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా , వినియోగం మీద ఉక్కుపాదం మోపాలన్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ట్రాఫిక్ విభాగం యొక్క ప్రాధాన్యతను వివరిస్తూ పట్టణాలు, నగరాల్లో సామాన్య ప్రజలకు ఎక్కువగా కనిపించేది, అందుబాటులో ఉంటూ తక్షణమే స్పందించే అవకాశం ఉండేది ట్రాఫిక్ పోలీసులకే అని తెలిపారు. ఎండా వానలలో, చలిలో సైతం రోడ్ల మీద విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసుల వల్లే నగరాల్లో ఎన్నో నేరాలు, రోడ్డు ప్రమాదాలు అదుపులో ఉన్నాయని డీజీపీ అభినందించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ట్రాఫిక్ సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి క్షత గాత్రులకు సహాయం చేయాలని సూచించారు.అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో పని చేయాలని, సమర్థవంతంగా పని చేసే అధికారులు, సిబ్బందికి రాష్ట్రస్థాయి పతకాలు, ప్రోత్సాహకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీ సుధీర్ బాబు , డిసిపి మల్కాజ్గిరి పద్మజ , డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర , డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ , డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి ఎస్ఓటి 1 రమణారెడ్డి, డిసిపి ఎస్ఓటి 2 మురళీధర్, డీసీపీలు ట్రాఫిక్ మల్లా రెడ్డి, శ్రీనివాస్, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ సైబర్ క్రైమ్ నాగలక్ష్మి, డిసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, హెడ్ క్వార్టర్ డిసిపి శ్యాంసుందర్, పలువురు అదనపు డీసీపీలు, ఏసిపిలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలి..

* **వేసవిలో త్రాగునీటి కొరత రాకుండా తగిన చర్యలు చేపట్టాలి...**
* **జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.**




ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ వోలు, సంబంధిత అధికారులతో సంక్షేమ పథకాల అమలు, పీఎం కూసుమ్ పథకం, వేసవిలో నీటి కొరత రాకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్లాంటేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల దరఖాస్తుల ఆన్లైన్ లో ఇంకా నమోదు పూర్తి కానటువంటి గ్రామాల దరఖాస్తులను రేపు ఉదయం లోగా పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. చర్ల 23, దుమ్ముగూడెం 23, అశ్వాపురం 3, మణుగూరు లో 7 మరియు బూర్గంపాడు లో 1 దరఖాస్తులు ఆన్లైన్ చేయవలసి ఉందని వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లో కొత్తగా వచ్చిన 3403 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఉపాధి హామీ పథకంలో 20 రోజుల పని దినాల కంటే ఎక్కువ ఉన్నవారిని గుర్తించాలన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 31 తారీకు లోపు పరిశీలించి నివేదిక అందించాలని ఆదేశించారు. అదేవిధంగా తప్పుగా బ్యాంక్ అకౌంట్ లో నమోదైనటువంటి 29 దరఖాస్తులను వెంటనే సరైన బ్యాంక్ అకౌంట్ నెంబర్లను నమోదు చేయాలని ఆదేశించారు. కొత్త రేషన్ కార్డులకు గ్రామ సభలు, ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్దేశిత పట్టిక ద్వారా వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. ఆ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయడం ద్వారా అర్హులకు డిజిటల్ రేషన్ కార్డ్ మంజూరు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క దరఖాస్తును క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పీఎం కూసుమ్ పథకం అమలులో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రతి మండలంలో సబ్ స్టేషన్ వివరాలను తాసిల్దారులకు తెలియజేయడం ద్వారా వారు ఆ సబ్ స్టేషన్ కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి. పీఎం కూసుమ్ పథకం క్రింద సోలార్ పవర్ ప్లాంట్ స్థాపనకు నాలుగు ఎకరాల భూమి అవసరం ఉంటుందని, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ స్థాపన చేయడం వలన 90 శాతం సబ్సిడీ వస్తుందని కలెక్టర్ తెలిపారు. 3 కోట్ల పెట్టుబడిలో 90 శాతం రాయితీ వస్తుందని తెలిపారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ ద్వారా సంవత్సరానికి 50 లక్షల ఆదాయం మహిళా సమాఖ్య కు వస్తుందని తెలిపారు. ఏపీవోలు ఆసక్తి గల మహిళా సమాఖ్య సంఘాలను గుర్తించాలని తెలిపారు. ప్రతి మండలంలో ఒక సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పవర్ ప్లాంట్ స్థాపనకు మన జిల్లాకు 150 ఎకరాల లక్ష్యం ఇచ్చిందని తెలిపారు. వేసవిలో నీటి కొరత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా పంచాయతీ అధికారులు గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి లభ్యత, నీటి సరఫరా లో సమస్యలను గుర్తించి పది రోజుల్లోగా సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. గుత్తి కోయిల ఆవాసాలను, గిరిజన గూడెం లను ప్రత్యేకంగా గుర్తించడం ద్వారా వారికి త్రాగునీటి కొరత రాకుండా సోలార్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.హరితహారం లో నాటే మొక్కలు ప్లాంటేషన్ లక్ష్యాలు మరియు సాధించిన ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేటటువంటి మొక్కల ప్లాంటేషన్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్ప, ముష్టి గింజలు, తంగేడు, మునగ, సుబాబులు, సిస్సు ,టకొామో, మందారం తదితర మొక్కలను నాటడం ద్వారా గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్లాంటేషన్ లో ఎదిగిన మొక్కలను వెంటనే అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పిడి హౌసింగ్ శంకర్, జిఎం ఇండస్ట్రీస్ తిరుపతయ్య, ఎల్ డి ఎం రామిరెడ్డి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి,సెర్ప్ పిడి నీలేష్, అడిషనల్ డిఆర్డిఓ రవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ గురుకుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన బాలుర గురుకుల పాఠశాల, వసతి గృహమును జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో మమేకమై వారికి అందుతున్న ఆహారం, సమస్యలను అడిగి స్వయంగా రాసుకున్నారు. మంచినీటి ట్యాపులు లీకేజ్ నీకు గమనించిన కలెక్టర్ స్వయంగా టాప్ ను బిగించారు.డైనింగ్ హాల్, క్లాస్ రూమ్లు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను స్వయంగా తనిఖీ చేశారు. కిచెన్ షెడ్ లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారి ని, విద్యార్థులకు వర్ణించడానికి సిద్ధంగా ఉన్న అన్నం పరిశీలించారు. వంటకు పరిశుభ్రమైన నీటిని వినియోగించాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భోజనం వండటానికి ముందే ప్రతి రోజు క్రమం తప్పకుండా ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నాసిరకం, నాణ్యతాలేమితో కూడిన పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల, వసతి గృహంలో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చదువు కొనసాగించేలా అనుకూల పరిస్థితులు కల్పించాలని అధికారులు ఆదేశించారు. వసతి గృహం, పాఠశాలలో విద్యార్థులకు కావలసిన ఏర్పాట్లు, వసతులు నివేదికల సమర్పించాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలు కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆవు దూడ గుర్తుపై ఓటెయ్యాలి..
# చంద్రారెడ్డిని గెలిపించాలి

* బస్తి నేతల పిలుపు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లో ఫిబ్రవరి 7న జరిగే ఎన్నికల్లో మాజీ అధ్యక్షులు ఊట్ల చంద్ర రెడ్డిని మరో మారు అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న ఆవు దూడ గుర్తుపై బస్తి వాసులు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బుధవారం పలువురు బస్తి నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగు పర్యాయాలు అధ్యక్షునిగా గెలుపొందిన తనను బస్తీకి ఎనలేని సేవలు అందించిన విషయాన్ని గుర్తు పెట్టుకొని 07 న జరిగే ఎన్నికల్లో మరోమారు గెలిపిస్తే బస్తీ మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. బస్తీలో నీటి శోఖాన్ని సృష్టించేందుకు బస్తి అధ్యక్షునిగా పోటీలో ఉండి పులి గుర్తుతో బస్తి వాసులు అందర్నీ మింగేసే ప్రయత్నం చేస్తున్న ప్రత్యర్థిని బస్తివాసులు తరిమి కొట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బస్తి లో తిరిగే పులి అనే మృగాన్ని తరిమికొట్టి సాధు జంతువైన ఆవు దూడలను ఆదరించాలని ఈ సందర్భంగా వారు స్పష్టంచేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నేతలు, బస్తి వాసులు పెద్దఎత్తున పాల్గొని చంద్రారెడ్డి ని శాలువతో సత్కరించి ఆవు దూడ గుర్తుపై ఓటు వేస్తామంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ఆవు దూడ గుర్తుపై ఓటు వేయాలని తెలియజేశారు.

## ఘనంగా ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రమణ్యం 56 వ జయంతి



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రముఖ పారిశ్రామికవేత్త మన్నె సుబ్రమణ్యం 56వ జయంతి వేడుకలలో భాగంగా బుదవారం మన్నె సుబ్రమణ్యం చారిటబుల్ ట్రస్టు, మన్నె మిత్రమండలి అధ్వర్యంలో కుషాయిగూడ ఇండస్ట్రియల్ క్యాంటిన్ వద్ద రక్తాదాన శిబిరం అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ వారితో కలసి నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది రక్తాదానం చేశారు. రక్తాదానం చేసిన వారికి మన్నె సుబ్రమణ్యం తనయుడు నాగఫణీంద్ర సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం 5 వేల మందికి అన్నదానం చేశారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు మన్నె సుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన మన్నె సుబ్రమణ్యం ఎంతో మంది పేదలకు ఆర్ధికంగా, విద్యా, వైద్యం, విదేశాల్లో చదువులు వంటి ఎన్నో సహాయసహకరాలు అందిచారని తెలిపారు. పరిశ్రమలు, ఆసుపత్రి, వంటి ఎన్నో పరిశ్రమలు స్థాపించి లక్షల మందికి ఉపాది కల్పిచారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు ఆయన అశయాలను కొనసాగించేందుకు మన్నె సుబ్రమణ్యం ట్రస్టు పేరుతో సేవకార్యక్రమాలు చేపడుతామని ఆయన తనయుడు నాగఫణీంద్ర తెలిపారు. ఈకార్యక్రమంలో సముద్రాల వేణుగోపాలాచారీ, నాయకులు టిజికె మూర్తి, సబ్బినేని వాసు, పాపరావు, హన్మంతరెడ్డి, నాగమురళీ, వాసిరెడ్డి శివప్రసాద్, ఉప్పలపాటి రఘు, మధు, నీరుగొండ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే యూనియన్ లక్ష్యం

* రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ.
* ఘనంగా టి యు డబ్ల్యూ జే ఐ జే యు సభ్యత్వ నమోదు కార్యక్రమం.





ప్రజాస్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక యూనియన్ టియుడబ్ల్యూజే ఐజేయు అని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం క్లబ్లో టీయూడబ్ల్యూజేఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కట్టెకోల రామనారాయణ హాజరై మాట్లాడారు. రామ్ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, నివాస స్థలాల సాధన విషయంలో నిరంతరం రాజీ లేని పోరాటం టియుడబ్ల్యూజే ఐజేయు చేస్తుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడవ మహాసభ జరగనుందని సభ్యత్వం నమోదు కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సోదరులు తరలిరావడం చాలా సంతోషంగా ఉందని రామనారాయణ అన్నారు. ఈ సందర్భంగా యూనియన్ మీద అన్న నమ్మకంతో ఇతర యూనియన్ల నుండి భారీ ఎత్తున ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా జర్నలిస్టులు ఐజేయూ యూనియన్లో సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేసి లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో యూనియన్ నేషనల్ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు నర్వనేని వెంకటరావు, జిల్లా కార్యదర్శి మబకాపు ఆనంద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జనుమాల రమేష్, ఖమ్మం యూనియన్ నగర అధ్యక్షుడు శ్రీనివాస్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏర్పుల సుధాకర్ రావు, ఉపాధ్యక్షులు కనుకు వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఎర్ర ఈశ్వర్, పెండ్యాల భాస్కరరావు , వీర మోహన్, జి శ్రీనివాస్, చంద్రశేఖర్, వీరభద్రం, నరసింహారావు, జైనుల్లాబుద్దిన్, బి శంకర్, దశరథ్ రజువా, భాస్కర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## చదువుతో పాటు క్రీడలను ప్రొత్సహించాలి

* మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : చదువుతో పాటు క్రీడలను ప్రొత్సహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. బుధవారం హకీంపేట్ లోని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ ను జిల్లా కలెక్టరు గౌతం సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ లో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కు సూచించారు. టెన్నీస్, బ్యాడ్ మెంటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ లో స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టరు సూచించారు. క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం స్కూలులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యతో పాటు క్రీడలను ఏవిధంగా నేర్పిస్తూన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలులో గల విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాలులను, గ్రౌండ్స్, డైనింగ్ హాల్, కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులను భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్ లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్ లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రావు ప్రస్తుతం స్కూల్ లో 4 వతరగతి నుండి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందని కలెక్టరుకు తెలియజేసారు. ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని తెలిపారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియోథెరపి అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ కు ఘన సన్మానం



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : మూడో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ పదవి కాలం ముగిసిన సందర్భంగా వారిని బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి సత్కరించుకోవలసిన బాధ్యత మన మీద ఉందన్నారు. వారు దానికి అంగీకరించారు. త్వరలో ఆ యొక్క తేదీని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, ట్రెజరర్ అంజయ్య, జాయింట్ సెక్రటరీ గణేష్ నాయక్, సంపత్ రెడి, ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్ యువకుడి దుర్మరణం

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్కు చెందిన వాజిద్ అనే యువకుడు మృతి చెందాడు. నగరంలోని ఖైరతాబాద్ ఎంఎస్ మక్తాకు చెందిన మహమ్మద్ వాజిద్ ఉన్నత చదువుల కోసం నాలుగేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం చికాగోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వాజిద్ మృతి చెందాడు. వాజిద్ మృతిపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

## సూర్యాపేట పరువు హత్య కేసులో
# ఆరుగురు నిందితుల అరెస్ట్

* ఆరు నెలల క్రితం ప్రేమ పెళ్లి చేసుకున్న కృష్ణ, భార్గవి
* ప్రేమ పెళ్లి చేసుకున్నందుకు కృష్ణపై కక్ష కట్టిన భార్గవి సోదరులు
* హత్య చేసి పిల్లలమర్రి మూసీ కాల్వకట్టపై పడేసిన నిందితులు



సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన పరువు హత్య కేసులో పోలీసులు ఈరోజు ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో భార్గవి ఇద్దరు సోదరులు నవీన్, వంశీ, నానమ్మ బుచ్చమ్మ, తండ్రి సైదులు ఉన్నారు. నవీన్ స్నేహితులు బైరి మహేశ్, సాయిచరణ్లను అరెస్ట్ చేశారు. ఆరు నెలల క్రితం వడ్లకొండ కృష్ణ, భార్గవి ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న సోదరులు కృష్ణను హత్య చేశారు. సోమవారం నాడు పిల్లలమర్రి కాల్వకట్టపై మృతదేహం లభ్యమైంది. కృష్ణను చంపుతామని భార్గవి సోదరుడు నవీన్ పలుమార్లు బెదిరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. కృష్ణను హత్య చేసేందుకు భార్గవి కుటుంబ సభ్యులు నలుగురితో పాటు మరో ఇద్దరు కుట్రపన్నారు. రెండు నెలలుగా కృష్ణను హత్య చేసేందుకు పథకం వేశారు. ఈ నెల 19న హత్య చేయాలని భావించినప్పటికీ అది కుదరలేదు. దీంతో ఆదివారం హత్య చేశారు. సూర్యాపేటలోని జనగామ క్రాస్ రోడ్లోని ఓ నిందితుడి వ్యవసాయ భూమి వద్ద ఆదివారం రాత్రి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని తెల్లవారుజాము వరకు కారులో తిరిగారు. చివరకు పిల్లలమర్రి సమీపంలోని మూసీ కాల్వకట్టపై మృతదేహాన్ని వదిలేసి నిందితులు పరారయ్యారు.

## సాంకేతిక సమస్య..
# ఆలస్యంగా నడిచిన హైదరాబాద్ మెట్రో రైళ్లు

హైదరాబాద్: సాంకేతిక సమస్య తలెత్తడంతో బుధవారం ఉదయం మెట్రో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. దీంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. అమీర్పేట హైటెక్సిటీ, మియాపూర్ అమీర్పేట, నాగోల్సికింద్రాబాద్ మధ్య మెట్రో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. సిగ్నలింగ్ వ్యవస్థలో సాంకేతిక సమస్య కారణంగా రైళ్లు ఆలస్యంగా నడిచినట్లు హైదరాబాద్ మెట్రో అధికారులు వెల్లడించారు. సమస్యను పరిష్కరించామని.. రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు పేర్కొన్నారు.





## పెద్దిరెడ్డి భూ ఆక్రమణపై విచారణకు ఆదేశం

- చిత్తూరు జిల్లా మంగళం పేట అడవుల్లో భూ కబ్జా చేసినట్లు ఆరోపణలు
- నిజనిజాలు తేల్చాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు

**ఏపీ బ్యూరో** వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణలపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. పెద్దిరెడ్డిపై చిత్తూరు జిల్లా మంగళంపేట సమీపంలోని అడవుల్లో భూకబ్జా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్)ను పవన్ ఆదేశించారు. అటవీ భూముల ఆక్రమణలు, అడవుల ధ్వంసంపై విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. రికార్డుల తారుమారులో ఎవరి పాత్ర ఉంది? లబ్ధి పొందిందెవరో తేల్చాలని.. దీనిపై చట్టపరంగా ముందుకెళ్లాలన్నారు. సత్వరమే ప్రాథమిక నివేదిక అందించాలని పీసీసీఎఫ్‌ను పవన్ ఆదేశించారు.

# బీజేపీ, ఆప్ మధ్య మాటల యుద్ధం

- తాగే నీళ్లలో ఎవరైనా విషం కలుపుతారా
- ప్రధాని మోదీ విమర్శలు
- అర్వింద్ కేజ్రీవాల్ ఆరోపణలపై కౌంటర్ ఇచ్చిన ప్రధాని



**నేషనల్ బ్యూరో :** యమునా నదిని ఉద్దేశపూర్వకంగా హరియాణా విషపూరితం చేస్తోందంటూ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. దిల్లీ ఎన్నికల వేళ.. ఈ వ్యాఖ్యలు ఆప్, హరియాణాలోని బీజేపీ ప్రభుత్వానికి మధ్య వివాదానికి దారితీసింది. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆమ్‌ఆద్మీపార్టీ పై ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. ప్రధాని తాగే నీళ్లలో హరియాణాలోని బీజేపీ ప్రభుత్వం విషం కలుపుతుందా..? అని ప్రశ్నించారు. 'దిల్లీ మాజీ ముఖ్యమంత్రి హరియాణా ప్రజలపై అసహ్యకరమైన ఆరోపణలు చేశారు. ఓటమి భయంతో 'ఆపద' (ఆప్) నేతలు ఆందోళన చెందుతున్నారు. హరియాణా, దిల్లీలో నివసించే ప్రజలు ఒకరు కాదా.. హరియాణా ప్రజల బంధువులు దేశ రాజధానిలో లేరా..? తమ సొంత ప్రజలు తాగే నీటిని విషపూరితం చేస్తారా..? హరియాణా పంపుతున్న నీరు దిల్లీలో ప్రతిఒక్కరు వినియోగిస్తున్నారు. అందులో ఈ ప్రధాని కూడా ఉన్నారు'అని కేజ్రీవాల్ వ్యాఖ్యలను మోదీ తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలో కాంగ్రెస్, ఆప్ పాలనపై విమర్శలు చేశారు. 'ఆ రెండు పార్టీలు 25 సంవత్సరాలు ఢిల్లీని పాలించాయి. కానీ ప్రజల సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. ట్రాఫిక్ జామ్స్, నీళ్లు నిలవడం, కాలుష్యం.. ప్రతి సమస్యా అలాగే ఉంది. మీ ఓటు మాత్రమే వీటి నుంచి విముక్తి కలిగించగలదు. 11 ఏళ్లపాటు పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలి. 25 సంవత్సరాల భవిష్యత్తు ప్రణాళికను వేయాలి. 25 సంవత్సరాలు ఆ రెండు పార్టీల పాలన చూశారు. ఇప్పుడు కమలానికి ఓ అవకాశం ఇవ్వండి అని ఓటర్లను కోరారు.




# ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- రెండు పట్టభద్రులు, ఒక టీచర్ స్థానానికి ఎన్నికలు
- షెడ్యూల్ విడుదల చేసిన భారత ఎన్నికల సంఘం
- ఫిబ్రవరి 27న ఎన్నికలు, మార్చి 3 కౌంటింగ్

**ఏపీ బ్యూరో** ఏపీలో మరో రెండు నెలల్లో ఖాళీ కానున్న రెండు పట్టభద్రులు, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానాన్ని భర్తీ చేసేందుకు భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉభయగోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా నియోజకవర్గాల్లో రెండు పట్టభద్రుల స్థానాలకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలోని ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది . ప్రస్తుతం ఏపీలోని పట్టభద్రుల స్థానాలకు ఐలా వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణారావు, టీచర్ ఎమ్మెల్సీగా పాకాలపాటి రఘువర్మ కొనసాగుతున్నారు. ఈ ముగ్గురి పదవీకాలం మార్చి 29తో ముగుస్తుంది. ఈ స్థానాలను భర్తీ చేసేందుకు గాను ఎన్నికల షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ, 10వ తేదీన నామినేషన్లకు ఆఖరు గడువు, 11న పరిశీలన , 13న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, మార్చి 3న కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటుందని స్పష్టం చేసింది.



## రిపబ్లిక్ డే వేడుకల్లో ఏపీ శకటానికి మూడో స్థానం

- ఉత్తరప్రదేశ్ కు మొదటి స్థానం, త్రిపురకు రెండో స్థానం
- ప్రకటించిన రక్షణ మంత్రిత్వ శాఖ

**ఏపీ బ్యూరో:** రిపబ్లిక్‌డే వేడుకల సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన శకటానికి మూడో స్థానం దక్కింది. ఏపీ ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మల శకటం పరేడ్‌ను తిలకించేందుకు వచ్చిన అతిథులు, ప్రజలకు ఎంతగానో ఆకట్టుకుంది. రేడ్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన శకటాల ప్రదర్శనతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కాగా శకటాల ప్రదర్శనలో ఉ త్తరప్రదేశ్‌కు మొదటి స్థానం, త్రిపురకు రెండో స్థానం దక్కగా ఏపీకి మూడో స్థానం వచ్చినట్లు రక్షణ మంత్రిత్వశాఖ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ శకటంగా గిరిజన శాఖ శకటం ఎంపికైనట్లు పేర్కొంది. త్రివిధ దళాల్లో జమ్మూకశ్మీర్ రైఫిల్స్ కవాతు బృందం, కేంద్ర బలగాల విభాగంలో ఢిల్లీ పోలీసు కవాతు బృందం ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్‌గా ఎంపికయ్యాయి.

## సింహచలం పంచ గ్రామాల సమస్యకు పరిష్కారం

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- సచివాలయంలో మీడియాకు వివరాలు తెలిపిన మంత్రి
- రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేలా సానుకూల వాతావరణం



**ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భద్రత, భరోసా వచ్చిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పెట్టుబడిదారులను ఆహ్వానించేలా ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి అనగాని, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు, ఎంపీ శ్రీభరత్ మీడియాతో మాట్లాడారు. మంత్రి అనగాని మాట్లాడుతూ.. ఎవరి వల్ల మంచి జరుగుతుందో రాష్ట్ర ప్రజలంతా చూస్తున్నారు. ఎప్పటినుంచో ఉన్న సమస్యలకు కూడా పరిష్కారం చూపిస్తున్నాం. సింహాచలం పంచగ్రామాల సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కాబోతోంది. దాదాపు 500 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయంగా ఇచ్చి 12,149 ఇళ్లను రెగ్యులరైజ్ చేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. గతంలో (201819)లో జీవో నెం.225 ఇచ్చాం. ఎంత భూమి ఆక్రమణకు గురైందో.. దానికి సమానంగా భూమి ఇచ్చేందుకు ఆనాడు నిర్ణయించారు. జీవో రాగానే కొంత మంది కోర్టుకు వెళ్లారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎలాంటి న్యాయం చేయలేకపోయింది. సుమారు 12,149 కుటుంబాలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేకపోయింది.

సింహాచలం భూములను ఆక్రమించి 12,149 ఇళ్లను నిర్మించుకున్నారు. వాటి క్రమబద్ధీకరణకు గతంలోనూ ప్రయత్నాలు చేశాం. ఇప్పుడు సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు 420 ఎకరాలకు బదులుగా 610 ఎకరాలు (సమాన రిజిస్ట్రేషన్ విలువతో) సింహాచలం దేవస్థానానికి బదలాయించాలని నిర్ణయం తీసుకున్నాం. దీని రిజిస్ట్రేషన్ విలువ రూ.5,300 కోట్ల వరకూ ఉంది. పెదగంట్యాడ, గాజువాక తదితర ప్రాంతాల్లో సింహాచలం దేవస్థానానికి 610 ఎకరాల భూమి ఇస్తున్నాం. దేవస్థానానికి చందనం చెట్లను పెంచుకునేందుకు అవకాశం ఉన్న చోట భూమి ఇస్తున్నాం.




# ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మ్యానిఫెస్టో

- కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలతో కూడిన మ్యానిఫెస్టో విడుదల
- 'అందరికీ ఆరోగ్యం 'పథకం కింద రూ. 25 లక్షల వరకు బీమా
- దిల్లీ ప్రజల కోసం ఐదు గ్యారెంటీలు ప్రకటించాం

**నేషనల్ బ్యూరో :** దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న తరుణంలో దిల్లీలోని రాజకీయ పక్షాలన్నీ ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా కాంగ్రెస్ ఐదు గ్యారెంటీలతో కూడిన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం ప్రకటించింది. 'అందరికీ ఆరోగ్యం' పథకం కింద రూ.25లక్షల వరకు ఆరోగ్య బీమా మెహంగై ముక్తి యోజన కింద సిలిండర్‌కు రూ.500 చొప్పున వంటగ్యాస్, ఉచిత రేషన్ కిట్ సీనియర్ సిటిజన్లు, వితంతువులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, నిరుపేదలకు నెలకు రూ.5వేల చొప్పున పెన్షన్ యువత కోసం ప్రైవేట్ లేదా ప్రభుత్వ రంగంలో ఒక ఏడాది అప్రెంటీస్‌షిప్, నెలకు రూ. 8,500 స్టైఫండ్ ప్యారీ దీదీ కింద మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం 300 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పలు హామీలను హస్తం పార్టీ ప్రకటించింది.

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్, పార్టీ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ బుధవారం ఈ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. 'దిల్లీ ప్రజల కోసం ఐదు గ్యారెంటీలు ప్రకటించాం. గ్యారెంటీ అంటే పౌరుల హక్కు అని అర్థం. ఆప్, బీజేపీ దిల్లీ కాలుష్యాన్ని కట్టడి చేయలేకపోతున్నాయి' అని విమర్శించారు. ఇక, దిల్లీలో తాము అధికారంలోకి వస్తే కులగణన నిర్వహిస్తామని, పూర్వాంచల్ వాళ్ల కోసం ఒక మంత్రిత్వశాఖను ఏర్పాటుచేస్తామని దేవేంద్ర యాదవ్ తెలిపారు. ఫిబ్రవరి 5న దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఆప్, బీజేపీ, కాంగ్రెస్‌లు తీవ్రంగా యత్నిస్తున్నాయి

# రాంగోపాల్ వర్మకు మరోసారి ఏపీ పోలీసుల నోటీసులు

- ఫిబ్రవరి 4న విచారణకు రావాలని ఆదేశం
- సినిమా షూటింగ్ ల నిమిత్తం రాలేనని చెప్పిన ఆర్జీవీ

**ఏపీ బ్యూరో :** దర్శకుడు రాంగోపాల్ వర్మ(ఆర్జీవీ) ను అసభ్యకర పోస్టుల కేసు వెంటాడుతోంది. ఈ వ్యవహారంలో ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఫిబ్రవరి 4న విచారణకు రావాలని ఆర్జీవీకి వాట్సప్ ద్వారా ఇచ్చిన నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. 4న సినిమా షూటింగ్‌ల నిమిత్తం బిజీగా ఉంటానని.. విచారణకు రాలేనని ఆయన సమాధానమిచ్చారు. 7వ తేదీన విచారణకు వచ్చే అవకాశాన్ని పరిశీలిస్తానని రాంగోపాల్‌వర్మ చెప్పినట్లు సమాచారం. గతంలో రెండుసార్లు ఆర్జీవీకి పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ విచారణకు హాజరుకాలేదు. అనంతరం హైకోర్టును ఆశ్రయించడంతో ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరైంది. దర్యాప్తునకు సహకరించాలని, పోలీసులు కోరినప్పుడు విచారణకు అందుబాటులో ఉండాలని వర్మకు ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో మరోసారి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా సోషల్ మీడియా



వేదికగా రాంగోపాల్ వర్మ అసభ్యకర పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.

# కేసు కొట్టేసినా తప్పుడు కథనాలు

- ఫైబర్ నెట్ వ్యవహారంలో చార్జ్ షీట్ ను కొట్టేసిన కోర్టు
- అయినా తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న ఓ పత్రిక
- ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి వెల్లడి

**ఏపీ బ్యూరో :** ఫైబర్ నెట్ వ్యవహారంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం చంద్రబాబుపై పెట్టిన కేసులో విచారణాధికారులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను న్యాయస్థానం కొట్టివేసిందని ఏపీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. ఛార్జ్‌షీట్‌ను కోర్టు తిరస్కరిస్తే జగన్ సొంతపత్రికలో మాత్రం తప్పుడు కథనం ప్రచురించారన్నారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులతో తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించారంటూ వార్త రాశారని జీవీ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టిన మధుసూదన్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డిపై కేసు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సీఐడీపై వచ్చిన ఆరోపణలపై ఆ విభాగం అధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాలని ఆయన సూచించారు.



## ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు

- సీఎం చంద్రబాబు నాయుడు
- ఇప్పటికే బెంగళూరుకు వెళ్లి అధ్యయనం చేసిన కమిటీ

**ఏపీ బ్యూరో** ఆంధ్రప్రదేశ్‌లో తాము అధికారంలోకి వస్తే.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటికే కొన్నింటిని నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీజనసేనబీజేపీ కూటమి ప్రభుత్వం.. ఇక, ఏపీఎస్‌ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు కొనసాగిస్తోంది.. ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీ బెంగళూరు వెళ్లి వచ్చింది. అక్కడ ఆ పథకం అమలు తీరుపై అధ్యయనం చేసింది.. ముఖ్యమంత్రి, ఆర్టీసీ అధికారులతో చర్చలు జరిపి క్షేత్ర స్థాయిలో సమస్యలపై కూడా దృష్టిపెట్టారు..



అలాగే అధికారులు సైతం తెలంగాణ, కర్ణాటక వెళ్ళి వచ్చారు... ఇద్దరి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించారు.. ప్రధానంగా కొత్త బస్సులు కొనాలని, కొత్తగా డ్రైవర్లు, కండక్టర్ల నియామకం జరపాలని నివేదికలో తెలిపినట్టు సమాచారం.. దీంతో ఉగాది నాటికి కసరత్తు పూర్తి చేసి, ఉగాది కానుకగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం సిద్ధమవతోందని తెలుస్తోంది...

# చాగంటికి అవమానమంటూ ప్రచారం

- తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేసిన టీటీడీ
- సోషల్ మీడియాల చానళ్లపై ఫిర్యాదు చేసిన ఆలయ అధికారులు

**ఏపీ బ్యూరో :** ఏపీ ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావుకు అవమానం జరిగిందంటూ అసత్య ప్రచారం చేసిన సోషల్ మీడియా ఛానళ్ల ప్రతినిధులపై పోలీసులకు టీటీడీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తిరుపతి యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌తో పాటు దిల్లీ, విజయవాడ పీఐబీలో ఫిర్యాదు చేసినట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా విషప్రచారం చేసిన సదరు సోషల్ మీడియా సంస్థల లైసెన్స్‌లను రద్దు చేయాలంటూ యూట్యూబ్ మెటా మేనేజ్‌మెంట్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది.

టీటీడీ తెలిపిన వివరాల ప్రకారం.. చాగంటి కోటేశ్వరరావు జనవరి 14న తిరుమల శ్రీవారి దర్శనంతో పాటు 16వ తేదీ సాయంత్రం మహతి ఆడిటోరియంలో ప్రవచనాలు ఇచ్చేందుకు డిసెంబర్ 20, 2024న తితిదే అనుమతి ఇచ్చింది. ఆయనకు ఉన్న క్యాబినెట్ ర్యాంక్ ప్రొటోకాల్ ప్రివిలేజ్ ప్రకారం జనవరి 14న శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా రాంబగీచ గెస్ట్ హౌస్ నుంచి శ్రీవారి ఆలయానికి తీసుకెళ్లేందుకు బ్యాటరీ వాహనాలను, శ్రీవారి ఆలయానికి బయోమెట్రిక్ ద్వారా అనుమతించేందుకు ఏర్పాట్లు చేసింది. కానీ టీటీడీ చేసిన ప్రత్యేక ఏర్పాట్లను చాగంటి సున్నితంగా తిరస్కరించారు. సామాన్య భక్తుల తరహాలోనే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు.

మరోవైపు జనవరి 8న తిరుపతిలో జరిగిన తోపులాట ఘటన నేపథ్యంలో చాగంటి ప్రవచన కార్యక్రమాన్ని వాయిదా వేస్తే బాగుంటుందని తితిదే ఉన్నతాధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా అంగీకరించారు. మరోసారి ఆయన అనుమతితో వేరే తేదీల్లో ప్రవచనాల కార్యక్రమం నిర్వహించేందుకు టీటీడీ నిర్ణయించింది. వాస్తవం ఇలా ఉండగా.. బయోమెట్రిక్ ద్వారా కాకుండా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి శ్రీవారి ఆలయంలోకి అనుమతించారని సోషల్ మీడియా ఛానళ్లలో అసత్యాలను ప్రచారం చేశారు. చివరి నిమిషంలో పరిపాలనా కారణాల వల్ల చాగంటి ప్రవచనాల కార్యక్రమాన్ని తితిదే రద్దు చేసినట్లు అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమే కాకుండా, తితిదేను పలుచన చేస్తూ ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలను పదేపదే దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపైనా, సంస్థలపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.



## వరుసగా రెండోరోజు లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

**76వేల ఎగువన ముగిసిన సెన్సెక్స్..!**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో సెషనల్‌లో లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 76వేలు, నిఫ్టీ 23వేల పాయింట్ల ఎగువ ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలో మిశ్రమ ఫలితాల మధ్య లాభాల్లో మొదలైన మార్కెట్లు చివరి వరకు అదే జోరును కొనసాగించాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, జొమోటో షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. ఫిబ్రవరి 1న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ సారి బడ్జెట్‌లో పన్ను మినహాయింపులు ప్రకటించనున్నారని భావిస్తున్నారు. అలాగే, ఆర్‌బీఐ సైతం వడ్డీ రేట్లను తగ్గించనున్నదనే అంచనాల నేపథ్యంలో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 76,138.24 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 75,975.80 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది.

గరిష్ఠంగా 76,599.73 పాయింట్లను తాకింది. చివరకు 631.5 పాయింట్ల లాభంతో 76,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 205.85 పాయింట్లు పెరిగి 23,163.10 వద్ద స్థిరపడింది. దాదాపు 2,874 షేర్లు పురోగమించగా.. మరో 937 షేర్లు పతనమయ్యాయి. మీడియా, క్యాపిటల్ గూడ్స్, ఐటీ, మెటల్, రియల్టీ రెండు నుంచి మూడుశాతం.. ఆటో, బ్యాంక్, ఫార్మా, ఆయిల్, గ్యాస్ 0.5 నుంచి 1.5 శాతం మధ్య లాభపడ్డాయి. ఎఫ్ఎంసీజీ సూచీ 0.5 శాతం పతనమైంది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.5 శాతం, స్మాల్ క్యాప్ సూచీలు 3.2 శాతం పెరిగాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, విప్రో, టాటా మోటార్స్, ఎస్‌బీఐ లైఫ్ అత్యధికంగా లాభపడగా.. ఏషియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, బీపీసీఎల్, బ్రిటానియా ఇండస్ట్రీస్, ఐటీసీ నష్టపోయాయి.

## పన్ను మినహాయింపులు ఇస్తారా..?

**కేంద్ర బడ్జెట్‌పైనే రియల్ ఎస్టేట్ రంగం ఆశలు..!**




**న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటిన పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై పలు రంగాలు భారీగా ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో ఒకటి రియల్ ఎస్టేట్ రంగం. వాస్తవంగా బడ్జెట్ అంటే.. అన్ని వర్గాలు తమకు ఏదైనా శుభవార్త చెబుతారేమోనని ఆశపడుతుంటాయి. ఈ సారి ప్రభుత్వం, బడ్జెట్ వైపు రియల్ ఎస్టేట్ రంగం సైతం భారీగానే ఆశలు పెట్టుకున్నది. గత ఏడాది రియల్ ఎస్టేట్ రంగం తీవ్రమైన గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నది.

ఈ క్రమంలో బడ్జెట్‌లో ఏమైనా ఊరట కలుగుతుందేమోనని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రస్తుతం గృహ రుణాల వడ్డీ రేట్లు పెరగడంతో పాటు ఇండ్లు కొనుగోలు చేస్తే వర్తించే పన్ను మినహాయింపులు పరిమితంగానే ఉన్నాయి. భారీగా పెరిగిన ధరల నేపథ్యంలో వేతన జీవుల ఆదాయం ఎక్కువగా ఇంటి అవసరాలకే సరిపోతుంది. దాంతో సొంతింటి కల చివరకు.. కలగానే మిగిలిపోతున్నది. రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఉంటేనే.. మిగతా రంగాల వ్యాపారాల్లోనూ పెరుగుదల ఉంటుందని.. లేదంటే తగ్గిపోతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో తమకు ప్రయోజనాలు కల్పిస్తుందని గృహనిర్మాణదారులతో పాటు కొనుగోలుదారులు ఆశిస్తున్నారు. సిమెంట్, స్టీల్, ఐరన్‌తో పాటు నిర్మాణానికి అవసరమయ్యే సామగ్రికి సంబంధించిన జీఎస్టీని తగ్గించడంతో పాటు గ్రీన్ బిల్డింగ్స్‌కు ప్రోత్సాహకాలు అందించాలని కోరుకుంటున్నారు. ఇక గృహ కొనుగోలుదారులు మాత్రం ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 24 (%దీ%) కింద వడ్డీరేట్లపై ఇన్‌కం ట్యాక్స్ పన్నులో మినహాయింపు పరిధిని రూ.5లక్షలకు పెంచాలని ఆశిస్తున్నారు. ప్రస్తుతం గృహ రుణ వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ.2 లక్షలుగా ఉన్నది.

నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపుతో పాటు వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.5లక్షలకు పరిమితి పెంచితే రియల్ ఎస్టేట్ రంగం భారీగా వృద్ధి చెందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గృహ రుణ వడ్డీ రేట్లపై ఆదాయపు పన్ను రూ.2లక్షలు బాగా తక్కువ అని పేర్కొంటున్నారు. పన్ను మినహాయింపును పరిమితి రూ.5లక్షలకు పెంచితే ఇండ్లను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తారని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. దాంతో రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో పాటు ఆదాయపు పన్ను రూపంలోనూ ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుందని రియల్ ఎస్టేట్ నిపుణులు పేర్కొంటున్నారు. మరి ఈ సారి బడ్జెట్‌లో ఏమైనా నిర్మాణ రంగానికి కేంద్రం ఊరట కల్పిస్తుందా? లేదా? వేచి చూడాల్సిందే.

## 2028 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ బైక్ ప్లాంట్




**ముంబై:** భారత్‌లో పూర్తిగా ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లు మాత్రమే తయారు చేసే ప్లాంట్‌ను 2028 నాటికి ప్రారంభిస్తామని జపాన్ ఆటో దిగ్గజం హెూండా మోటార్ ప్రకటించింది. ఈ ప్లాంట్‌లో విస్తృత శ్రేణిలో మోటార్ సైకిళ్లు తయారు చేయనున్నట్లు తెలిపింది. అయితే ఈ ప్లాంట్ ఎక్కడ ఏర్పాటు చేసేది, పెట్టుబడులు ఎంతనేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ కొత్త ప్లాంట్ నుంచి ఎనిమిది మోడళ్లలో ఎలక్ట్రిక్ బైక్‌లు, స్కూటర్లు ఉత్పత్తి చేయనున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మినోరు కాటో తెలిపారు. అలాగే విద్యుత్ వాహనాల్లో కీలకమైన బ్యాటరీల కోసం వివిధ బ్యాటరీ ఉత్పత్తిదారులతో సంప్రదిస్తున్నామని, తాము తయారు చేయాలనుకుంటున్న మోటార్ సైకిళ్ల స్వభావానికి సరిపోయే బ్యాటరీలు తయారు చేయడంతో పాటు సరఫరా స్థిరంగా ఉండాలన్నది తమ ధ్యేయమని ఆయన చెప్పారు. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కు అందుబాటులో ఉన్న సబ్సిడీ విధానాలు, కంపెనీలు అందిస్తున్న వినూత్న మోడళ్ల మద్దతుతో 10 లక్షల విద్యుత్ టూ వీలర్లకు డిమాండ్ ఏర్పడిందని, మొత్తం వాహనాల మార్కెట్లో ఇది ఐదు శాతంతో సమానమని ఆయన వెల్లడించారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 30 విద్యుత్ మోడళ్లు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికే 13 మోడళ్లు ప్రవేశపెట్టినట్టు చెప్పారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 40 లక్షల విద్యుత్ బైక్‌లు విక్రయించాలన్నది తమ లక్ష్యమని మినోరు తెలిపారు.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి తిలక్ వర్మ..



### తొలిసారిగా టాప్-5కి వరుణ్ చక్రవర్తి

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో రాజ్‌కోట్ వేదికగా జరిగిన మూడో టీ20లో ఐదు వికెట్ల పడగొట్టిన భారత జట్టు లెగ్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఐసీసీ టీ20 ఇంటర్నేషనల్ ర్యాకింగ్స్‌లో టాప్-5కి చేరుకున్నాడు. ఏకంగా 25 స్థానాలు ఎగబాకి తొలిసారిగా ఐదో ప్లేస్‌కి చేరుకున్నాడు. అదే సమయంలో భారత స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ని అధిగమించాడు. టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు.

### ఆ ఘనత సాధించిన మూడో భారత బౌలర్..

ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి బంతితో అద్భుత ప్రదర్శన చేశాడు. అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో రెండోసారి ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. దాంతో టీ20ల్లో భారత్ తరఫున ఒకటి కంటే ఎక్కువసార్లు ఐదు లేదంటే అంతకన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా నిలిచాడు. ఇంతకు ముందు భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్ ఈ ఘనత సాధించారు. 2018లో దక్షిణాఫ్రికా, 2022లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన టీ20ల్లో భువనేశ్వర్ ఐదు వికెట్లు తీశాడు. 2018లో ఇంగ్లాండ్, 2023లో దక్షిణాఫ్రికాపై కుల్దీప్ యాదవ్ వికెట్లు పడగొట్టాడు. వరుణ్ గతేడాది దక్షిణాఫ్రికాలో 17 పరుగులు ఇచ్చి ఐదు వికెట్ల కూల్చాడు.

### అగ్రస్థానానికి ఆదిల్ రషీద్

ఇంగ్లాండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ భారత్‌తో జరుగుతున్న సిరీస్‌లో బంతితో రాణించాడు. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానానికి చేరుకున్నాడు. రషీద్ 2023లోనూ అగ్రస్థానానికి చేరుకోగా.. తాజాగా వెస్టిండీస్ బౌలర్ అకిల్ హుస్సేన్‌ని అధిగమించి అగ్రస్థానానికి చేరాడు. 718 రేటింగ్ పాయింట్ల రషీద్ ఖాతాలో ఉన్నాయి. అకిల్ హుస్సేన్ రెండో స్థానంలో ఉండగా.. శ్రీలంక ఆటగాడు వనిందు హసరంగ మూడో స్థానంలో ఉన్నాడు. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు ఇంగ్లాండ్‌తో ఆడిన మూడు మ్యాచుల్లో 108 పరుగులు చేశాడు. ఇందులో ఓ హాఫ్ సెంచరీ ఉన్నది. దాంతో కెరియర్‌లో తొలిసారిగా ఐసీసీ ర్యాకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. 832 పాయింట్లతో బ్యాటర్స్ ర్యాకింగ్‌లో రెండో స్థానానికి చేరాడు. ఇక ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ 855 పాయింట్లతో నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు.

### ఆల్ రౌండర్లలో పాండ్యా హవా..

ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా జోరు కొనసాగుతున్నది. ప్రస్తుతం పాండ్యా నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. 255 పాయింట్లతో అగ్రస్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన సిరీస్‌లో ఇప్పటి వరకు 50 పరుగులు చేయడంతో పాటు ఐదు వికెట్లు తీశాడు. అదే సమయంలో అక్షర్ పటేల్ టాప్-12లో కొనసాగుతున్నాడు. ఇప్పటి వరకు 17 పరుగులు చేసి ఐదు వికెట్లు తీశాడు.





## భవిష్యత్‌లో త్రిష మరింత రాణించాలి..

**ఎమ్మెల్సీ కవిత ఆకాంక్ష**



**హైదరాబాద్:** మహిళల అండర్-19 టీ20 ప్రపంచ కప్ టోర్నీలో రికార్డు సెంచరీతో చరిత్ర సృష్టించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభినందనలు తెలిపారు. ప్రపంచ స్థాయిలో త్రిష సత్తా చాటడం మనందరికీ గర్వకారణం. భవిష్యత్తులో త్రిష మరింత రాణించాలని ఆకాంక్షిస్తున్నట్లు కవిత పేర్కొన్నారు.

గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష.. మలేషియాలో జరుగుతున్న అండర్-19 మహిళల ప్రపంచకప్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన సూపర్ సిక్స్ పోరులో త్రిష (59 బంతుల్లో 110 నాటౌట్, 13 ఫోర్లు, 4 సిక్సర్లు) 53 బంతుల్లోనే శతకం బాది ఈ టోర్నీలో మొట్టమొదటి సెంచరీ చేసిన క్రికెటర్‌గా తన పేరును రికార్డుల పుస్తకాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుంది. త్రిషతో పాటు మరో ఓపెనర్ కమిలిని (42 బంతుల్లో 51, 9 ఫోర్లు) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు చేసిన సంగతి తెలిసిందే.

## రైల్వేస్‌తో రంజీ మ్యాచ్‌కు వేగంగా సన్నద్ధమవుతున్న విరాట్ కోహ్లీ



**న్యూఢిల్లీ:** భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దాదాపు 12 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ రంజీ మ్యాచ్ ఆడబోతున్నాడు. ఈ నెల 30న ఢిల్లీ, రైల్వేస్ జట్ల మధ్య ప్రారంభం కానున్న రంజీ మ్యాచ్‌లో.. కోహ్లీ ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ నేపథ్యంలో రైల్వేస్‌తో రంజీ మ్యాచ్ కోసం వేగంగా సన్నద్ధమవుతున్నాడు. మంగళవారమే అరుణ్ జైట్లీ స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు.

బుధవారం కూడా ఉదయాన్నే స్టేడియానికి చేరుకుని ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ప్రాక్టీస్ చేస్తూ ఉత్సాహంగా కనిపించాడు. కోహ్లీ తీరు చూస్తుంటే చాన్నాళ్ల తర్వాత ఆడబోతున్న రంజీ మ్యాచ్ కోసం ఉవ్విళ్లూరుతున్నట్లు కనబడుతోంది. కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడేందుకు సిద్ధం కావడంతో ఢిల్లీ టీమ్ మేనేజ్‌మెంట్ అతనికి కెప్టెన్సీ ఆఫర్ చేసింది. కానీ కోహ్లీ ఆ ఆఫర్‌ను తిరస్కరించాడు. యువ కెప్టెన్ ఆయుష్ బదోనీ కెప్టెన్సీలో ఆడేందుకే మొగ్గు చూపాడు.

కాగా రంజీ ట్రోఫీ గ్రూప్-లో ఢిల్లీ.. ఒక గెలుపు, రెండు ఓటములు, మూడు డ్రాలతో ఆరో స్థానంలో ఉన్నది. సౌరాష్ట్రతో జరిగిన గత మ్యాచ్‌లో ఢిల్లీ 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇండియన్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సౌరాష్ట్ర తరఫున 12 వికెట్లు తీసి ఢిల్లీని దెబ్బకొట్టాడు. జడేజా తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టాడు. కాగా 36 ఏళ్ల విరాట్ కోహ్లీ 2012 ఉత్తరప్రదేశ్‌లో తన ఆఖరి రంజీ మ్యాచ్ ఆడాడు. ఇప్పుడు మళ్లీ ఆడబోతున్నాడు.

## టెస్టుల్లో స్టీవ్ స్మిత్ 10,000 పరుగులు..

### 15వ బ్యాటర్‌గా రికార్డు

**గాలే:** అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ స్టీవ్ స్మిత్ చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో పది వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఆ ఘనతను అందుకున్న 15వ బ్యాటర్ అయ్యాడు. దీంతో ఎలైట్ క్రికెటర్ల జాబితాలో చేరాడతను. ఇండియాతో ఇటీవల జరిగిన టెస్టు సిరీస్ సమయంలో.. స్మిత్ పది వేల పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో నిలిచాడు. అయితే ఇవాళ శ్రీలంకతో ప్రారంభమైన టెస్టులో ఆ మైలురాయి దాటేశాడు.




టెస్టుల్లో పది వేల రన్స్ చేసిన బ్యాటర్లలో 15వ ప్లేయర్‌గా నిలిచాడతను. ఆస్ట్రేలియా తరపున నాలుగవ బ్యాటర్ అయ్యాడు. గతంలో పది వేల రన్స్ చేసిన ఆసీస్ బ్యాటర్లలో రికీ పాంటింగ్(13,378), అలన్ బోర్డర్(11,174), స్టీవ్ వా(10,927) ఉన్నారు. టెస్టుల్లో లీడింగ్ రన్ స్కోరర్‌గా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. అతను 15,921 రన్స్ చేశాడు. లంకతో జరుగుతున్న గాలే టెస్టులో.. తాజా సమాచారం ప్రకారం .. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 60 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 261 రన్స్ చేసింది. ఖవాజా 119, స్టీవ్ స్మిత్ 64 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నారు.

# తండేల్ అంచనాలకు చేరుకుంటుందా..?

**టాకీస్:** సాయి పల్లవి కుర్రకారులో ఈ పేరుకు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫిదా' చిత్రంతో నాయికగా పరిచయమైన ఈ అందాల తార తొలిచిత్రంతోనే యువ ప్రేక్షకులను ఆకట్టుకుంది. భానుమతి ఒక్కటే పీస్, హైబ్రీడ్ పిల్ల అంటూ తొలిచిత్రంలో సందడి చేసిన సాయి పల్లవి.. మొదటి సినిమాతోనే వచ్చిన క్రేజ్‌ను ఎప్పుడూ క్యాష్ చేసుకోవాలనుకోలేదు. సినిమాల విషయంలో చాలా సెలెక్టివ్‌గా తన మనసుకు నచ్చిన కథలనే చేసుకుంటూ వెళుతుంది. అందుకే ఈ కథానాయికకు తెలుగు నాట కూడా ఇంత క్రేజ్, నానితో నటించిన



ఏమ్‌సీఏ, ఇటీవల వచ్చిన 'అమరన్' చిత్ర విజయాల్లో సాయి పల్లవి మ్యాజిక్ వర్కవుట్ అయ్యిందనే చెప్పాలి. ముఖ్యంగా 'అమరన్' చిత్రానికి ఎటువంటి పబ్లిసిటి లేకపోయినా, కేవలం సాయి పల్లవి క్రేజ్‌తోనే ఆ చిత్రం తమిళంలో కంటే తెలుగులోనే ఎక్కువ వసూళ్లను సాధించింది. ఇక తాజాగా ఈ క్రేజీ నాయిక నటిస్తున్న చిత్రం 'తండేల్'. నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఈ రోజు బజ్ రావడానికి సాయి పల్లవి కూడా ఓ ముఖ్య కారణం. తెలుగులో ఆమెకున్న క్రేజ్ ఖచ్చితంగా ఈ చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు సాధించడానికి ఉపయోగపడుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. మంగళవారం విడుదలైన ఈ చిత్రం ట్రైలర్‌లో నాగచైతన్య, సాయి పల్లవి మధ్య కెమిస్ట్రీ కూడా చూడ ముచ్చటగా ఉంది. ట్రైలర్ కూడా ఆసక్తికరంగా ఉంది. ఇక సాయి పల్లవి మ్యాజిక్ ఈ చిత్రానికి ఎలాగు ఉంది. కాబట్టి తప్పకుండా ఈ చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు సాధిస్తుందని, సాయి పల్లవి ఛరిష్మా, మ్యాజిక్ ఈ చిత్రానికి ప్లస్ అవుతుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 15 ఏళ్ల తరువాత పిలుపు వచ్చింది : తాప్సీ

ఎంతో ఇష్టమైన దర్శకుడి సినిమా వేడుకకు ఆహ్వానం వచ్చిందని అన్నారు హీరోయిన్ తాప్సీ. తాజాగా ఆమె 'బ్యాడ్‌గర్ల్' అనే చిత్ర టీజర్ లాంచ్ వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుక చెన్నైలో జరిగింది. మరి తాప్సీ చెబుతున్న ఆ ఇష్టమైన దర్శకుడు ఎవరు? ఏంటా కథ? అనే విషయంలోకి వస్తే.. బాలీవుడ్ దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'బ్యాడ్‌గర్ల్'. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చెన్నై నగరంలో జరిగిన వేడుకలో విడుదల చేశారు. గ్రాస్‌రూట్ ఫిల్మ్ కంపెనీ పతాకంపై తెరకెక్కిన ఈ మూవీకి బాలీవుడ్ సంగీత దర్శకుడు అమిత్ త్రివేది స్వరాలు సమకూర్చారు. ఈయన తమిళ చిత్రానికి సంగీతం అందించడం ఇదే తొలిసారి. దర్శకుడు వెట్రిమారన్ వద్ద 'వడ చెన్నై', 'విచారణై' వంటి సినిమాలకు అసిస్టెంట్‌గా పనిచేసిన వర్షా భరత్ ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 'కమింగ్ ఆఫ్ ఏజ్ ఫ్యామిలీ డ్రామా'గా రూపొందిన ఈ మూవీలో ప్రధాన పాత్రను అంజలి శివరామన్ పోషించగా.. శాంతిప్రియ, హృద్ హారూన్, టీజే అరుణాచలం, శరణ్య రవిచంద్రన్ తదితరులు ఇతర పాత్రలలో నటించారు. ప్రస్తుతం ఈ సినిమా తుదిదశ చిత్రీకరణ జరుపుకుంటోంది.




# వయస్సు సమస్యే కాదు: ప్రగ్యా జైస్వాల్

**టాకీస్:** మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది జబల్ పూర్ సుందరి ప్రగ్యా జైస్వాల్. ఆ తర్వాత వరుణ్ తేజ్‌తో నటించిన కంచె సినిమాతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. నందమూరి బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటించిన లెజెండ్ సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇటీవలే మరోసారి బాలకృష్ణతో కలిసి డాకుమహారాజ్‌లో మెరిసింది ప్రగ్యా జైస్వాల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం మంచి టాక్ తెచ్చుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సీనియర్ హీరో బాలకృష్ణతో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయడం, నటీనటుల మధ్య ఏజ్ గ్యాప్ గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది ప్రగ్యా జైస్వాల్. ఆయన ఒక లెజెండ్, బాలకృష్ణ పేరు చెప్పగానే నాకు



పాజిటివిటీ అనే పదం గుర్తొస్తుంది. ఆయన దగ్గర నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. బాలకృష్ణ అందరినీ ఒకేలా గౌరవిస్తారు.. చాలా మంచి మనిషి. పాత్రకు తగ్గట్టుగా యాక్టర్లను సెలెక్ట్ చేస్తారు తప్ప వారి వయస్సును చూసి సినిమా అవకాశాలివ్వరంది. నా పాత్రకు వందశాతం న్యాయం చేశానా..? లేదా అనేదే ఆలోచిస్తాను. నా దృష్టిలో వయస్సు అనేది అసలు సమస్యే కాదు. అఖండలో మా ఇద్దరినీ స్క్రీన్‌పై చూసి షాకయ్యానంటూ చెప్పుకొచ్చింది. డాకు మహారాజ్ థియేటర్లలో విడుదలైనప్పటి నుంచి అంతా నన్ను డాకు మహారాణి అని పిలుస్తున్నారు. ఆ పాత్రకు ప్రేక్షకులు అంతలా కనెక్ట్ అయ్యారు. ఒక నటిగా ఇది నాకెంతో సంతృప్తినిచ్చే విషయమంది ప్రగ్యా జైస్వాల్. ఈ భామ బాలకృష్ణతో మరోసారి అఖండ 2 సినిమాలో కూడా నటిస్తోంది.

# సినిమాకు ఎంట్రీ ఇస్తున్న సైఫ్ కొడుకు

## హీరోయిన్‌గా శ్రీలీల..

టాకీస్: బాలీవుడ్ అగ్ర నటుడు సైఫ్ అలీఖాన్ కొడుకు ఇబ్రహీం అలీఖాన్ బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధం అయ్యింది. ఇబ్రహీం బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చాడు అగ్ర దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్. సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్ట్ పెడుతూ.. ఇబ్రహీంని బాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాను అంటూ ప్రకటించాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో ఒక పోస్ట్ పెట్టాడు. 12 ఏండ్ల క్రితం ఇబ్రహీం అలీఖాన్ తల్లి అమృత (సైఫ్ అలీఖాన్ మొదటి భార్య)ని మొదటి సారి నేను కలిశాను. తనను డింగి అని పిలవడం నాకు అలవాటు. అమృత మా నాన్నతో కలిసి ధర్మ ప్రొడక్షన్స్‌లో 'దునియా' అనే సినిమా చేసింది. ఈ సినిమా తర్వాత మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. తనతో కలిసి చైనీస్ డిన్నర్ చేయడం.. జేమ్స్ బాండ్ సినిమా చూడడం.. ఇప్పటికి మర్చిపోలేను. మేము కలిసిన సెకండ్ టైంలోనే నన్ను స్వంత మనిషిలా చూసుకుంది. సైఫ్‌ని నేను మొదటిసారి ఆనంద్ మహింద్రా ఆఫీస్‌లో కలిశాను. ఆ తర్వాత ఈ ఫ్యామిలీతో మంచి రిలేషన్ ఏర్పడింది. సినిమా అనేది వీరి రక్తంలోనే ఉంది. త్వరలోనే మీ ముందుకు ఇబ్రహీం అలీఖాన్‌ని పరిచయం చేయబోతున్నాను. అప్పటివరకు వెయిట్ చేయండి అంటూ కరణ్ జోహార్ రాసుకొచ్చాడు. నటి శ్రీలీలతో కలిసి ఇబ్రహీం అలీఖాన్ రెస్టారెంట్‌లో నుంచి బయటికి వచ్చిన ఫొటోలు ఇటీవలే వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఇబ్రహీం డెబ్యూ మూవీలో హీరోయిన్‌గా శ్రీలీల నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.






# కంటిన్యూ సూపర్‌హిట్స్ ఇచ్చినా నాకు మర్యాద దక్కడం లేదు: అనిల్ రావిపూడి

**టాకీస్:** ఈ సంక్రాంతికి విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' ఎలాంటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ముఖ్య తారలుగా నటించిన ఈ చిత్రం హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా విజయం సాధించింది. సినిమా విడుదలై మూడో వారంలోకి ప్రవేశించిన ఈ చిత్రం వసూళ్లు ఏ మాత్రం తగ్గలేదు. ఇక ఈ చిత్రంతో దర్శకుడిగా అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి.

'పటాస్' సినిమాతో దర్శకుడిగా ఇంట్రడ్యూస్ అయిన ఈ యువ దర్శకుడు ఆ తరువాత సాయి ధరమ్ తేజ్‌తో సుప్రీమ్, రవితేజతో రాజా ది గ్రేట్, వెంకీ, వరుణ్‌లతో ఎఫ్-2, మహేష్‌తో సరిలేరు నీకెవ్వరు, వెంకీతో ఎఫ్-3, బాలకృష్ణతో 'భగవంత్ కేసరి' చిత్రాలు తెరకెక్కించాడు. ఇప్పుడు తాజాగా వెంకటేష్‌తో సంక్రాంతికి వస్తున్నాం అయితే ఈ ఎనిమిది చిత్రాల్లో రెండు యావరేజ్ సినిమాలు కాగా మిగతా ఆరు సినిమాలు మంచి విజయాలు సాధించినవే. ముఖ్యంగా సంక్రాంతికి వస్తున్నాం చిత్రం బిగ్గెస్ట్ కమర్షియల్ హిట్‌గా కొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. అయితే తను ఇంత సాధించిన తనకు తెలుగు సినీ పరిశ్రమలో సరైన రెస్పెక్ట్ లేదని క్రిటిక్స్ కూడా తనకు ఇవ్వాల్సినంత గౌరవం ఇవ్వట్లేదని చెబుతున్నాడు అనిల్ రావిపూడి.



ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తను తన అసంతృప్తిని వ్యక్తపరిచాడు ఆయన మాట్లాడుతూ " ఎనిమిది సక్సెస్‌లు వచ్చినా నాకు తెలుగు సినీ పరిశ్రమలో,క్రిటిక్స్ దృష్టిలో సరైన గుర్తింపు లేదు. రావాల్సినంత రెస్పెక్ట్ రావడం లేదు. అది ఎందుకో నాకు తెలియదు. కానీ నాకు ప్రేక్షకులు అందించే ప్రేమే ముఖ్యం. వాళ్లు నా ప్రతి సినిమాను ఆదరిస్తున్నారు. అయితే నా విషయంలో సినీ విమర్శకుల తప్పు కూడా ఏమీ లేదు. వాళ్లకు నచ్చే సినిమాలు వేరుగా ఉంటాయి. మన సినిమాలు అందరికి నచ్చాలని నిబంధన ఏమీ లేదు. అయితే కొంత మంది దర్శకులకు చిన్న విషయంలో కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎలివేషన్ ఇస్తుంటారు. కానీ నా విషయంలో ఇన్ని విజయాలు సాధించిన ఎందుకో రావాల్సిన గుర్తింపు కూడా రావడం లేదు. కానీ అందరికి చివరిగా ఆడియన్స్‌కు సినిమా నచ్చితేనే అది సక్సెస్.

ఆడియన్స్ టిక్కెట్స్ కొనుక్కొని సినిమాకు వెళ్లడం కావాలి. ఆ విషయంలో నేను నూటికి నూరుశాతం సక్సెస్. సంక్రాంతికి వస్తున్నాం సినిమా విజయంతో ఆడియన్స్ నా పై మరో సారి తమ ప్రేమను చూపారు. నా సినిమాల పట్ల వాళ్ల అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టి చెప్పారు. అయితే నా పట్ల ఉన్న కేర్‌లెస్ భావం ఇంతకు ముందుతో పోల్చితే ఇప్పుడు తగ్గింది. 'సంక్రాంతికి వస్తున్నాం' విజయంతో అది ఇంకా తగ్గిందని అనుకుంటున్నాను. ఫ్యూచర్‌లో నేను మరిన్ని గొప్ప విజయాలు అందించడానికి ప్రయత్నిస్తాను. సో. వాళ్లు అప్పుడైనా నా ప్రతిభను గుర్తించి రెస్పెక్ట్ ఇస్తారేమో చూడాలి' అంటూ తన మనసులోని ఆవేదనను వ్యక్తపరిచాడు అనిల్ రావిపూడి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.